తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM కరీంనగర్ : fb.com/vaartha Digital
Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
2-10-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 242 పేజీలు: 8+16 వెల: 6.50





లోక్‌సభ మాజీ స్పీకర్ జిఎంసి బాలయోగి జయంతి సందర్భంగా బుధవారం పార్లమెంటులోని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ ఓం బిర్లా

# అమెరికాలో 'షట్‌డౌన్'

>> షట్‌డౌన్ కావడం గమనార్హం. ఈ షట్‌డౌన్ కారణంగా సుమారు 7.5 లక్షల మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులకు తాత్కాలికంగా జీతాలు ఆగిపోనున్నాయి. మిలిటరీ సహా అత్యవసర సేవలు అందించే ఉద్యోగులు వేతనాలు లేకుండానే పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసరం కాని సేవలు, నేషనల్ పార్కులు, ఫుడ్ ఇన్‌స్పెక్షన్లు వంటి సేవలు నిలిచిపోనున్నాయి. చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులను శాశ్వతంగా తొలగిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ప్రభుత్వ నిధులు ముగిసినా తాత్కాలిక నిధుల ప్యాకేజీకి ఆమోదం లభించక షట్‌డౌన్ ఏర్పడినపుడు చట్ట ప్రకారం ఫెడరల్ ఏజెన్సీలు తమ కార్యకలాపాలను నిలిపివేయాల్సి ఉంటుంది. అలాంటి సమయంలో ప్రభుత్వ సిబ్బందిని అత్యవసర ఉద్యోగులు, అత్యవసరం కాని ఉద్యోగులు అని రెండు వర్గాలుగా విభజిస్తారు. ప్రజల ప్రాణాలను, ఆస్తులను రక్షించే వ్యవస్థల్లో పనిచేసేవారైన సైనిక సిబ్బంది, మెడికల్ సిబ్బంది, సరిహద్దు రక్షణ, పోలీస్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, సోషల్ సెక్యూరిటీ చెక్కుల పంపిణీ వంటి సేవలు కొనసాగుతాయి. అయితే ఈ వ్యవస్థల్లో పనిచేసే వారు షట్‌డౌన్ సమయంలో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుంది.. కానీ షట్‌డౌన్ ముగిసేవరకు వారికి జీతం ఇవ్వరు. ఆ తర్వాతే బకాయిలు చెల్లిస్తారు. ఇక అత్యవసరం కాని ఉద్యోగులకు తాత్కాలికంగా వేతనం లేని సెలవును ఇస్తారు. కాంగ్రెస్ బడ్జెట్ ఆఫీస్ అంచనాల ప్రకారం.. సుమారు 7.50 లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులు తాత్కాలికంగా జీతం కోల్పోయే అవకాశాలు ఉన్నాయి. షట్‌డౌన్ వల్ల అనేక కీలక ప్రభుత్వ సేవలు నిలిచిపోనున్నాయి. అందులో ఫెడరల్ ఫుడ్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్స్, ఫుడ్ ఇన్‌స్పెక్షన్లు, ప్రభుత్వ ప్రీస్కూల్స్, స్టూడెంట్ లోన్స్, ఇమ్మిగ్రేషన్ విచారణలు, నేషనల్ పార్కులు వంటివి పూర్తిగా మూసివేయడం లేదా తక్కువ సంఖ్యలో సేవలు అందించడం చేస్తారు. అత్యవసర సేవలతో పాటు సోషల్ సెక్యూరిటీ, మెడికేర్ చెక్కుల పంపిణీ.. నాసా అంతరిక్ష మిషన్లు.. ట్రంప్ ఇమ్మిగ్రేషన్ కార్యకలాపాలు. ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్డీయే)లోని కొన్ని ప్రజా ఆరోగ్య పనులు కొనసాగనున్నాయి. అయితే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ పరిస్థితికి మరింత ఆజ్యం పోశారు. షట్‌డౌన్ జరిగితే తన పాలనలో చాలా మంది ఫెడరల్ ఉద్యోగులను శాశ్వతంగా తొలగిస్తానని వారు ఎక్కువగా డెమొక్రాట్లు అయి ఉంటారని ఆయన చేసిన హెచ్చరికలు ఇప్పుడు అమెరికాలో సంచలనం సృష్టిస్తున్నాయి.

## పిటిషన్లపై విచారణ 4కు వాయిదా

>> ఎమ్మెల్యేల తరుపు న్యాయవాదులు పిటీషనర్ల తరుపు న్యాయవాదులను క్రాస్ ఎగ్జామిన్ చేయగా, బుధవారం జరిగిన విచారణలో పిటీషనర్ల తరుపు న్యాయవాదులు ఎమ్మెల్యేల తరుపు న్యాయవాదులను క్రాస్‌ఎగ్జామిన్ చేశారు. మొదట రాజేంద్ర నగర్‌ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ న్యాయవాదులు ఆయనపై ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ న్యాయవాదుల మధ్య విచారణ కొనసాగింది. ఆ తర్వాత చేవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య న్యాయవాదులు ఆయనపై ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ న్యాయవాదుల మధ్య వాదనలు జరిగాయి. ఎమ్మెల్యేల విచారణకు ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, వారి న్యాయవాదులకు స్పీకర్ గంట చొప్పున సమయాన్ని కేటాయించారు. ఈ విచారణ కొనసాగుతున్నందున అక్టోబర్ 6వ తేదీ వరకు అసెంబ్లీ ప్రాంగణంలో ఆంక్షలు విధిస్తూ స్పీకర్ కాకార్యాలయం ఇటీవలనే బులెటిన్‌ను విడుదల చేసింది. అసెంబ్లీ ప్రాంగణంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా, ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్యల విచారణలో పిటిషనర్ల తరుపు న్యాయవాదులు ఎమ్మెల్యేల తరుపు న్యాయవాదుల మధ్య క్రాస్ ఎగ్జామినేషన్ జరిగింది. పార్టీ మారిన అనేక అంశాలపై వాదనలు జరిగినట్లుగా తెలిసింది. క్రాస్ ఎగ్జామినేషన్‌లో పిటిషనర్ల అడ్వకేట్లు అనేక ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. వారి నుంచి వివరాలు రాబట్టుకునేందుకు తమ దగ్గరున్న సాక్ష్యాలతో వాదనలు వినిపించినట్లు తెలిసింది.

# సాఫీగా 'స్థానిక' సమరం

>> కోరతామని ఆయన తెలి పారు. పోలీసు ఖాళీలు వెంటనే భర్తీ అయితే పోలీసు విభాగం మరింత పటిష్టమవుతుందని డిజిపి చెప్పారు. పోలీసు వ్యవస్థపై రాజకీయ పార్టీల విమర్శలు సరైంది కాదని ఆయన అన్నారు. తమకు సి బుక్, రెడ్ బుక్ లేదని వున్నది పోలీసు బుక్ ఒక్కటేనని శివధర్ రెడ్డి తెలిపారు. పోలీసులు ప్రజల కోసం పనిచేస్తారని, రాజకీయ పార్టీల కోసం కాదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో మావోయిస్టుల గు రించి ఆయన మాట్లాడుతూ వారి శకం ముగిసిందని ఆయన మరోసారి తేటతెల్లం చేశారు. నక్సలైట్లు ఆయుధాలు వీడితే వారి గురించి ఆలోచిస్తా మని ఆయన తెలిపారు. మావోయి స్టులో అంతర్గత సమస్య ఇటీవల బాగా ముదిరిందని ఒక ప్రశ్నకు సమాధానంగా డిజిపి తెలిపారు. తాము ఆయుధాలు వీడి లొంగిపోతామని మ ల్లోజుల వేణుగోపాల్ రావు రాసిన లేఖను డిజిపి ఉదహరించారు. దీనిని పార్టీకి చెందిన మరికొందరు ఖండిం చారని, ఇది మావోయిస్టుల మధ్య వు న్న అభిప్రాయాబేధాలను సూచిస్తోందని డిజిపి తెలిపారు. మారిన పరిస్థితుల్లో నక్సలైట్లు ఇంకా కాలం చెల్లిన పద్దతులను పట్టుకుని ముందుకు వెళ్లాలను కోవడం సరైంది కాదని ఆయన అన్నారు. రష్యా, చైనా వంటి దేశాల లోనే మావోయిజానికి కాలం చెల్లి ందని, అటువంటిది భారత్‌లో దాని ని అమలు చేయడానికి నక్సలైట్లు ప్రయత్నించడం సరికాదని డిజిపి తెలిపారు. ఈ క్రమంలోనే దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో వందల సంఖ్యలో మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోతున్నారని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో సైబర్ నేరాలను, డ్రగ్స్ మాఫియాను సమర్థవంతంగా కట్టడి చేస్తామని ఆయన తెలిపారు. ఈ విషయంలో మరోమాట వుండదని ఆయన పేర్కొన్నారు. డిజిపిగా తనపై న మ్మకం వుంచి తనను నియమించిన సిఎం రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్కకు శివధర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

**డిజిపి కార్యాలయంలో సాయుధ పోలీసుల స్వాగతం**

అంతకు ముందు డిజిపిగా మొదటిసారి డిజిపి కార్యాలయానికి వచ్చిన శివధర్ రెడ్డికి కార్యాలయం వద్ద సాయుధ పోలీసులు గౌరవ స్వాగతం పలికారు. శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ సహా, సిటీ కొత్వాల్ సజ్జన్నార్, టిఎస్ఎస్‌పి అదనపు డిజి సంజయ్ జైన్, గ్రేహౌండ్స్ అదనపు డిజి అనిల్ కుమార్ ఇతర సీనియర్ పోలీసు అధికారులు శివధర్ రెడ్డిని ఆయన ఛాంబర్ వరకు తీసుకువెళ్లారు. అనంతరం డిజిపి తన స తీమణితో కలిసి ఛాంబర్‌లో పూజలు చేశాక కుర్చీలో ఆసీనులయ్యారు. అనంతకం వేద పండితులు శివధర్ రెడ్డిని ఆశీర్వదించారు.

## వారం - వర్జ్యం

02-10-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, శుక్లపక్షం
దశమి రా.7.05
ఉత్తరాషాఢ ఉ.9.10
వర్జ్యం : మ.1.14-మ.2.51
దు.ఉ.9.58-ఉ.10.46 2)మ.2.45-మ.3.33
శుభసమయం: ఉ.7.30-8.30,సా.6.45-7.30
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** ప్రముఖులను కలుసుకొని ముఖ్య విషయాలపై చర్చిస్తారు.

**వృషభం:** ఆస్తి వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందుతారు. ఋణాలు తీరుస్తారు.

**మిథునం:** ఎంతటి కార్యాన్ని అయినా దీక్ష, పట్టుదలతో సాధిస్తారు.

**కర్కాటకం :** జీవిత భాగస్వామి సలహాలు స్వీకరిస్తారు. నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

**సింహం:** వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకోండి. వస్తులాభం.

**కన్య :** నూతన వ్యక్తులతో పరిచయాలు మిత్రత్వానికి దారి తీస్తాయి.

**తుల :** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ఇంటా బయిటా అనుకూలం.

**వృశ్చికం:** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**ధనుస్సు:** సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మకరం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**కుంభం:** రాజకీయ, కళారంగాల వారికి విదేశీ పర్యటనలు వుంటాయి.

**మీనం :** భాగస్వామ్య వ్యాపారాలు మినహా పూర్తి వ్యాపారాలు లాభాల బాటలో ఉంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## వారం - వర్జ్యం

03-10-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, శుక్లపక్షం
ఏకాదశి సా.6.17
శ్రవణ ఉ.9.31
వర్జ్యం : మ.1.30-3.04
దు.ఉ.8.22-9.10, 2) 12.21-మ.1.09
శుభసమయం:ఉ.5.30-6.15,సా.6.30-7.15
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** చర్మసంబంధిత బాధలు కలుగకుండా జాగ్రత్తలు పాటించండి.

**వృషభం:** ఇబ్బందులలో పడిన మీ ఆత్మీయవర్గానికి రహస్యంగా సహాయపడతారు.

**మిథునం:** సోదర వర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న వివాదాలకు తెరపడుతుంది.

**కర్కాటకం :** జీవివాశయాన్ని ఏ విధంగానయినా సరే సాధించాలని దృఢ నిర్ణయానికి వస్తారు.

**సింహం:** అందుకుగాను మీ పరోక్షంలో జరుగుతున్న అన్ని పనులను కూడా గమనిస్తూ కఠినంగా ప్రవరిస్తారు.

**కన్య :** ఉపయోగపడని వ్యక్తులనుకున్న వారే కార్యవిజయాలకు కారణం అవుతారు.

**తుల :** మొండి వ్యవహారాలను కాలానికి వదిలివేస్తారు. వాహన సౌఖ్యం.

**వృశ్చికం:** చికాకు కలిగించే కుటుంబ పరిస్థితులకు దూరంగా పారి పోకుండా బాధ్యతలు నెరవేరుస్తారు.

**ధనుస్సు:** అప్పు చేయక పోవటమే నిజమైన పొదుపని గుర్తిస్తారు.

**మకరం:** పెండింగ్ కేసులు పరిష్కార బాటలో ఉంటాయి.

**కుంభం:** ఎదుటి వారి సంభాషణల లోని నిజానిజాలను గుర్తెరిగి తదనుగుణంగా నడుచుకుంటారు.

**మీనం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నైరుతి పవనాల సీజన్‌లో 8% అదనపు వర్షపాతం

### సీజన్ ముగిసినా అక్టోబరు నుంచి యేడాది చివరి వరకూ వర్షాలు

### ఐఎండి చీఫ్ మృత్యుంజయ్ మహాపాత్ర

**న్యూఢిల్లీ, అక్టోబరు 1:** దేశంలో 4 నెలల రుతుపవనాల సీజన్‌లో సాధారణం కన్నా 8 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. మేఘ విస్ఫోటనాలు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పటికీ ఈ రుతుపవనకాలం విజయవంతమైందని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మొహపాత్ర తెలిపారు. భారత వాతావరణ శాఖ ప్రకారం ఈ ఏడాది దేశవ్యాప్తంగా వర్షాకాలంలో 868.6 మి.మీ వర్షం కురవాలి. కానీ ఈ ఏడాది ఏకంగా 937.2 మి.మీ వర్షపాతం కురిసింది. అంటే 8 శాతం ఎక్కువగా వర్షాలు కురిశాయి. ఇక తూర్పు, ఈశాన్య భారతదేశాల విషయానికి వస్తే ఈ ఏడాది 1089.9 మి.మీ వర్షం కురిసింది. ఇది సాధారణంగా ఆ ప్రాంతంలో కురిసే 1367.3 మి.మీ వర్షపాతం కంటే 20 శాతం తక్కువ కావడం గమనార్హం. ఇక బీహార్, అరుణాచల్‌ప్రదేశ్, అసోం, మేఘాలయల్లో లోటు వర్షపాతం నమోదైంది. 1901 తరువాత తూర్పు, ఈశాన్య భారతదేశాల్లో రెండో అత్యల్ప వర్షపాతం నమోదు అయ్యింది. 2013లో ఇక్కడ అత్యల్ప వర్షపాతం 1065.7 మి.మీ కురిసింది. ముఖ్యంగా 2020 నుంచి ఈ ప్రాంతంలో వర్షపాతం క్రమంగా తగ్గుతున్న ధోరణి కనిపిస్తోంది. మొత్తంగా చూసుకుంటే ఈ ప్రాంతంలో గత 20 ఏళ్లలో వర్షపాతం తగ్గుతోందని అధ్యయనాలు కూడా చూపిస్తున్నాయి. వాయువ్య భారతదేశంలో 2001 తర్వాత ఇది అత్యధికం. 1901 నుంచి చూసుకుంటే ఇది ఆరో అత్యధిక వర్షపాతం. వాయువ్య భారతదేశంలోని అన్ని జిల్లాల్లో జూన్, ఆగస్టు, సెప్టెంబర్‌లలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు అయ్యింది. మధ్య భారతదేశంలో ఈ నాలుగు నెలల్లో 1125.3 మి.మీ వర్షపాతం నమోదు అయ్యింది. ఇది సాధారణం 978 మి.మీ కంటే 15.1 శాతం ఎక్కువ. ఇక దక్షిణ ద్వీపకల్పంలో సాధారణం 716.2 మి.మీ కంటే 9.9 శాతం ఎక్కువ వర్షపాతం నమోదు అయ్యింది. రుతుపవన కాలం నేటితో ముగిసినప్పటికీ, ఇకపైనా దేశవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ముఖ్యంగా వాయువ్యంలోని కొన్ని ప్రాంతాలు మినహా, భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు వర్షాలు సాధారణం కంటే ఎక్కువ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

# మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కన్నుమూత

### సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్,మంత్రుల సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు1:** మాజీ మంత్రి సూర్యపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి(73) కన్ను మూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. ఆసుపత్రిలో చికిత్స పొందతూ బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. దామోదర్‌రెడ్డి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. వైస్ హయాంలో ఐటీ శాఖ మంత్రిగా పనిచేశారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీ కి తీరని లోటని, వారి కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు. మాజీ మంత్రి దామోదర్ రెడ్డి మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు..ఆయన మృతి పట్ల తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. దామోదర్ రెడ్డి మరణం.కాంగ్రెస్ పార్టీ కి తీరని లోటు అని పేర్కొన్నారు. దామోదర రెడ్డి మృతి పట్ల తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. 5 సార్లు ఎమ్మెల్యే గా మంత్రిగా పని చేసిన దామోదర్ రెడ్డి ప్రజల మనిషిగా గుర్తింపు తెచ్చుకున్నారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. దామోదర్‌రెడ్డి మరణం పట్ల మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ,జూపల్లి కృష్ణారావు తదితరులు సంతాపం ప్రకటించారు. ప్రజల సందర్శనార్థం 3వ తేదీన బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి భౌతిక కాయాన్ని తరలిస్తారు. 4వ తేదీన సూర్యపేట జిల్లా తుంగతుర్తిలో దామోదర్‌రెడ్డి అంత్యక్రియలు జరుగనున్నాయి.

# గెలుపు బాధ్యత మీదే

>> కావాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు,సీనియర్ నాయకులు వి. హనుమంతరావు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకరయ్య, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, మినరల్స్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై వీరంతా చర్చించారు. అలాగే న్యాయపరమైన అంశాల్లో రిజర్వేషన్లపై ఎలా ముందుకు వెళ్లాలో కూడా సమావేశంలో చర్చించారు. ఈ నెల 8న కోర్టులో రిజర్వేషన్ల అంశంపై గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిపై సిఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు, దీనిపై నివేదిక ఇవ్వాలని ముగ్గురు మంత్రులకు ఆయన సూచించారు. తాజా రాజకీయ పరిస్తితులను వివరిస్తూ నివేదికలో అభ్యర్థుల పేర్లు, వివరాలు ఉండాలని సిఎం పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికశాతం స్థానాలను కైవసం చేసుకోవాలని స్పష్టం చేశారు.ఈ అంశంలో ఇన్‌చార్జ్ మంత్రులతో పాటు ఎంపీల భాగస్వామ్యంతో వెళ్లాలని సూచించారు. సిఎం రేవంత్‌రెడ్డితో పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా సమావేశమై ఈ అంశంపై చర్చించారు.



గోరఖ్‌పూర్‌లోని గోరఖ్‌నాథ్ ఆలయంలో బుధవారం మహానవమి సందర్భంగా 'కన్యా పూజ' నిర్వహిస్తున్న యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్

# కేంద్ర ఉద్యోగులకు 3% డిఎ పెంపు

>> ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. దీంతో శాలరీ బేసిక్ పే, పెన్షన్‌లపై చెల్లిస్తున్న డీఏ 55 శాతం నుంచి 58 శాతానికి పెరిగింది. ఈ నిర్ణయం 2025 జులై 1 నుంచే అమల్లోకి వస్తుందని తెలిపారు. జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించిన డీఏ బకాయిలను అక్టోబరు నెల వేతనంతో, దీపావళి కంటే ముందే అందిస్తామని తెలిపింది. ఈ నిర్ణయంతో దేశంలోని 49.2 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68.7 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరుతుందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 7వ వేతన కమిషన్ నిబంధనల ప్రకారం డీఏ పెంపు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు అందరికీ వర్తిస్తుందని తెలిపారు. తాజా డీఏ పెంపు వల్ల కేంద్ర ప్రభుత్వ ఖజానాపై ఏటా అదనంగా రూ.10,083.96 కోట్ల భారం పడుతుందన్నారు. ఈ పెంపు జులై 1 నుంచే అమలులోకి వస్తుందని ఆయన తెలిపారు. దీని వల్ల 49.19 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68.72 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. మోడీ ప్రభుత్వం నిర్ణయంతో దాదాపు కోటి మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పండగ వాతావరణం మరింత ఆనందదాయకంగా మారుతుందని చెప్పవచ్చు.

**రాష్ట్రానికి మరో నాలుగు కేంద్రీయ విద్యాలయాలు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

తెలంగాణలో విద్యాభివృద్ధికి 11 ఏళ్లుగా అన్నిరకాలుగా సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వం తాజాగా మరో 4 కేంద్రీయ విద్యాలయాలను కేటాయించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న 35 కేంద్రీయ విద్యాలయాలకు తోడుగా ఈ నాలుగు విద్యాలయాలు మారుమూల ప్రాంతాల్లోనూ నాణ్యమైన ప్రాథమిక, సెకండరీ విద్యను అందించడంలో కీలకం కానున్నాయని తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడికి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కి ధన్యవాదములు తెలిపారు. తెలంగాణకు మంజూరైన కేంద్రీయ విశ్వవిద్యాలయాలు... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం (యాస్పిరేషనల్ డిస్ట్రిక్ట్), ములుగు జిల్లా కేంద్రం (గిరిజన ప్రాంతం)3. జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలం-చెల్గల్, వనపర్తి జిల్లా నాగవరం శివార్‌లు ఉన్నాయి. ఇవి కాకుండా, గత రెండేళ్లలోనే కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో నాణ్యమైన సెకండరీ విద్యను అందించేందుకు.. రూ.400 కోట్లతో 832 పిఎంశ్రీ స్కూల్స్‌ను మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా పిఎంశ్రీ స్కూల్స్ కోసం ఎక్కువ కేటాయింపులు అందుకున్న రాష్ట్రం తెలంగాణనే కావడం విశేషం. వీటితో పాటు సమగ్రశిక్షా అభియాన్ కింద గత రెండేళ్లలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం, దాదాపు రూ.2వేల కోట్లను కేటాయించింది. దాదాపు వెయ్యికోట్లతో ములుగు జిల్లాలో సమ్మక్క, సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది.

# నేను 'టారిఫ్'లను ప్రేమిస్తా..

>> అన్నారు. సుంకాలద్వారా లక్షలకోట్ల డాలర్లు తీసుకురాగలిగామని ఈ సుంకాలు వాణిజ్య ఒప్పందాలు పూర్తయితే అమెరికా ముందెన్నడూ లేని విధంగా సుసంపన్న దేశంగా మారుతుందన్నారు. రాబడులు అనూహ్యంగాపెరుగుతున్నాయన్నారు. ఇతర దేశాలు ఏళ్లతరబడి మనల్ని పిండుకున్నాయని అయినా కూడా మనం ఇపుడు ఆ దేశాలను సహేతుకంగా చూస్తున్నామన్నారు. ఇపుడు అమెరికాలోకి వస్తున్న ధనం ముందెన్నడూ చూడలేదని చెప్పిన ట్రంప్ ఒక్కరోజులోనే 31 బిలియన్ డాలర్ల రాబడులు వచ్చాయని, వీటితో కొన్ని యుద్ధ నౌకలను కొనుగోలుచేసుకోవచ్చని అన్నారు. ప్రపంచంలోని అనేకదేశాలపై ట్రంప్ సుంకాలు విధించిన సంగతి తెలిసిందే,వాణిజ్యఒప్పందం చేసుకోని ఏదేశం పైన అయినా భారీ సుంకాలు తప్పవని హెచ్చరించిన ట్రంప్ అనుకున్నట్లుగానే 25 శాతంనుంచి 50 ఆపై 100శాతం సుంకాలను కూడా విధిస్తున్నారు. తాజాగా బ్రాండెడ్ ఫార్మా ఉత్పత్తులపై 100శాతం సుంకాలను ప్రకటించిన సంగతి తెలిసిందే.

# సిఎం రేవంత్, మాజీ సిఎం కెసిఆర్ దసరా శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు1:** దసరా పండుగ(విజయదశమి) సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దసరా పండుగను విజయదశమి పేరుతో దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నారని అన్నారు. తెలంగాణ సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలాయ్ బలాయ్ తీసుకోవడం.. పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం, శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం తెలంగాణకు ప్రత్యేకమని సీఎం గుర్తు చేశారు.తెలంగాణ అప్రతిహత విజయాలతో అభివృద్ధి సాధించాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలతో ఈ పండుగ జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆ దుర్గామాతను ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దసరా శుభాకాంక్షలు తెలి పారు. ఓటమి నుంచి రాష్ట్రప్రజల జీవితాలు గెలుపు దిశగా పయనించాలి అని కేసీఆర్ ఆకాంక్షించారు. తొమ్మిది రోజుల బతుకమ్మ సంబురాలతో పాటు, దేవీ శరన్నవరాత్రుల దుర్గమ్మ పూజల పర్వదినాలకు కొనసాగిం పుగా.. విజయ దశమిగా జరుపుకునే దసరా పండుగకు తెలంగాణ ప్రజా జీవనంలో ప్రత్యేక స్థానం ఉన్నదని కేసీఆర్ అన్నారు. కార్య దీక్షలను అపజయాల నుంచి విజయాల దిశగా నడిపిస్తూ, ఏనాటికైనా ధర్మానిదే అస లు విజయం అనే స్ఫూర్తిని దసరా పండుగ మనకు అందిస్తుందని కేసీఆర్ తెలిపారు. దసరా పండుగ విశిష్టతను గౌరవిస్తూ, జమ్మి చెట్టును రాష్ట్ర వృక్షంగా, పాలపిట్టను రాష్ట్ర పక్షిగా, నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిందని ఈ సందర్భంగా కేసీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో బతుకమ్మతో పాటు విజయ దశమి స్ఫూర్తి ఇమిడి ఉన్నదని, అదే స్ఫూర్తితో పదేండ్ల పాలనలో ప్రజలను ప్రగతి విజయాల దిశగా నడిపించామన్నారు. ఓటమి నుంచి రాష్ట్ర ప్రజల జీవితాలు గెలుపు దిశగా పయనించాలని కేసీఆర్ ఆకాంక్షించారు.

# ఖర్గేకు అస్వస్థత

### ఆస్పత్రికి తరలింపు

### గుండెకు పేస్‌మేకర్

**బెంగళూరు, అక్టోబర్ 1:** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర జ్వరం, శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్న ఖర్గేను బెంగళూరులోని ఎంఎస్ రామయ్య ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం వైద్యులు ఆయనకు చికిత్స చేస్తున్నారని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నేత, ఖర్గే తనయుడు ప్రియాంక ఖర్గే 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఖర్గే ఆరోగ్యం నిలకడగానే ఉందని చెప్పారు. శ్వాస సంబంధ సమస్యలు, జ్వరం కారణంగా ఆయనకు గుండె వేగం తగ్గకుండా ఉండేందుకు పేస్‌మేకర్‌ను అమర్చాలని వైద్యులు సూచించినట్లు ఆయన కుమారుడు ప్రియాంక్ ఖర్గే వెల్లడించారు. అందుకోసమే ఆస్పత్రిలో చేర్పించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని పేర్కొన్నారు. గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం జనరల్ వార్డులో విశ్రాంతి తీసుకుంటున్న ఖర్గేను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు పరామర్శించారు.

# ప్రైవేట్ కాలేజీలు

>> ఆయన ప్రశ్నించారు.ఈ నెల 12లోపు బకాయిలు చెల్లించకుంటే 13 నుంచి సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. ఈ అంశంపై సీఎంవో కార్యాలయంతో తప్ప మరెవరితో చర్చించమని, అవసరం అయితే విద్యార్థులతో కలిసి ఛలో హైదరాబాద్ చేపడతామని ఆయన హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగం ఆఖరి ప్రాధాన్యతగా ఉందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వ విడుదల చేయలేదన్నారు.గత నెల 21, 22 తేదీల్లో రూ.600 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారని, కానీసీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చినా బకాయిలు చెల్లించలేదు. రూ.200 కోట్లు నిధులు మాత్రమే విడుదల చేశారన్నారు.దీపావళిలోపు రూ.1,200 కోట్లు ఇస్తామని అన్నారు ఎలా ఇస్తారో చెప్పాలి. ఈ నెల 12లోపు బకాయిలు చెల్లించకుంటే 13 నుంచి సమ్మెకు వెళ్తామని అంతే కాకుండా ఈ అంశంపై సీఎంవో కార్యాలయంతో తప్ప మరెవరితో చర్చించం. అవసరం అయితే విద్యార్థులతో కలిసి ఛలో హైదరాబాద్ చేపడతామన్నారు.

# మేడిగడ్డ పునరుద్ధరణ!

>> కాళేశ్వరం స్కామ్ పై విచారణను సీబీఐ అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ కేసు విచారణను టేకప్ చేసిన సీబీఐ.. విచారణను ప్రారంభించింది. ఈకేసులో విచారణలో భాగంగా FIR నమోదు చేసిన సీబీఐ.. త్వరలో కేసీఆర్,హరీష్, ఈటలతో సహా అధికారు లను విచారిస్తుందనే వార్తలు వస్తున్నాయి. దీనిపై ఇంకా ఎక్కడ సీబీఐ అధికారిక ప్రకటన చేయలేదు.

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
కరీంనగర్
: fb.com/vaartha Digital

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-10-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 242 పేజీలు: 8+16 వెల: 6.50

నైరుతి పవనాల సీజన్‌లో 8% అదనపు వర్షపాతం 2

ఆర్‌ఎస్‌ఎస్ సంస్థకాదు మహోన్నత శక్తి: మోడీ



## దసరా శుభాకాంక్షలు

విజయదశమి పర్వదినం సందర్భంగా పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు

-డా॥ గిరీష్ కుమార్ సంఘీ
'వార్త' సిఎండి & మేనేజింగ్ డైరెక్టర్

### సెలవు

పండుగ సందర్భంగా గురువారం 'వార్త' కార్యాలయానికి సెలవు. శుక్రవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం 4వ తేదీ శనివారం.

# గెలుపు బాధ్యత మీదే

## 'స్థానిక' ఎన్నికలపై మంత్రులతో సిఎం రేవంత్



## ఆషామాషీ కాదు.. సీరియస్‌గా తీసుకోండి

### జెడ్పీటీసి స్థానాలకు 3 పేర్ల చొప్పున 6వ తేదీలోగా ఇవ్వాలి

### 'జూబ్లీహిల్స్'పై నివేదిక ఇవ్వాలని ముగ్గురు మంత్రులకు సూచన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు1:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. స్థాక సంస్థల ఎన్నికలను ఆషామాషీగా తీసుకో రాదని, ప్రతిష్టాత్మకంగా తీసుకుని మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించే బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంత్రులకు సూచించారు. పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల జాబితా సిద్ధం చేయడంతోనే సరిపోదని వారిని గెలిపించే బాధ్యతనూ తీసుకోవాలని అన్నారు. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసం నుంచి మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో పిసిసి చీఫ్ బి.మహేష్ కుమార్ గౌడ్ తదితరులు ముఖ్యమంత్రి తో మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మంత్రులపై బాధ్యత పెట్టారు. ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసేందుకు ఒక్కో జెడ్‌పిటిసి స్థానానికి ముగ్గురి పేర్లతో జాబితా సిద్ధం చేసి, అక్టోబర్ 6వ తేదీలోగా పిసిసి చీఫ్‌కు అందజేయాలని ఆయన సూచించారు. తమిళనాడు తరహాలోనే తెలంగాణాలోనూ బిసి రిజర్వేషన్లు అమలవుతాయని బిసి నేతలు స్పష్టం చేశారు. గవర్నర్, రాష్ట్రపతి వద్ద ఉన్న పెండింగ్ బిల్లులు మూడు నెలలకు మించి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసుకోవచ్చని తమిళనాడులో ఇటీవల కోర్టు తీర్పు ఉన్న నేపథ్యంలో తెలంగాణలోకూడా అదే తరహాలో రిజర్వేషన్లు అమలు అవుతాయని పేర్కొన్నారు. మంత్రి పొన్నం నివాసంలో బిసినేతల కీలకసమావేశం మంగళవారం జరిగింది. రిజర్వేషన్ల కేసులో ఇంప్లీడ్ >>2

### నేడు కొండారెడ్డిపల్లిలో సిఎం దసరా వేడుకలు 6




# అమెరికాలో 'షట్‌డౌన్'

### ఆర్థిక వ్యవస్థ ప్రతిష్టంభన

### 7.5 లక్షల ఉద్యోగుల జీతాలకు గండి

### అత్యవసర సేవలు మినహా అన్నీ బంద్

**వాషింగ్టన్, అక్టోబరు 1:** అమెరికాలో అధికార రిపబ్లికన్లు, ప్రతిపక్ష డెమొక్రాట్ల మధ్య రాజకీయ రగడతో ఆ దేశ ప్రభుత్వం అధికారికంగా షట్‌డౌన్‌లోకి ప్రవేశించింది. రిపబ్లికన్లు ప్రవేశపెట్టిన తాత్కాలిక నిధుల ప్యాకేజీ తాము ప్రతిపాదించిన డిమాండ్లకు అనుగుణంగా లేదని డెమొక్రాట్లు నిరాకరించడంతో నిధుల గడువు ముగిసిపోయి చివరికి ప్రభుత్వం స్తంభించింది. 2018, 2019 తర్వాత ఆరు సంవత్సరాల్లో ఇది మొదటి >>2

## నేను 'టారిఫ్'లను ప్రేమిస్తా..

### నాకెంతో ఇష్టమైన మాట అదే: ట్రంప్




**వాషింగ్టన్, అక్టోబరు 1:** 'ట్యారిఫ్' అన్న పదం తనకు ఎంతో ఇష్టమైన పదమని, ఈ ట్యారిఫ్‌లతోనే అమెరికాను మళ్లీ సుసంపన్న దేశంగా మారుస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికా ఫస్ట్ వాణిజ్య అజెండాల్లో దిగుమతులపై విధిస్తున్న భారీ సుంకాలతో అమెరికాను మళ్లీ గ్రేట్ అగైన్‌గా మారుస్తామని, లక్షకోట్ల డాలర్ల ఎకానమీని వృద్ధిచేస్తామని ట్రంప్ అన్నారు. ట్యారిఫ్‌లవల్లనే అమెరికా ఖజానాకు ఎంతో న్యాయం జరుగుతున్నదని, దశాబ్దాలపాటు అమెరికా ఇస్తున్న ప్రయోజనాలు ఇతర దేశాలు తరలించుకుపోతున్నాయన్నారు. 'ట్యారిఫ్‌లను ప్రేమిస్తా. ట్యారిఫ్ అనేది ఎంతో అంతమైన పదం' అని చెప్పిన ట్రంప్ అమెరికాను సంపన్నదేశంగా తీర్చిదిద్దేందుకు ఇదే సరైన పదం >>2

### మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కన్నుమూత 2

సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్, మంత్రుల సంతాపం

## మళ్లీ సమ్మె దిశగా ప్రైవేట్ కాలేజీలు

### 12 వరకు సర్కార్‌కు గడువు



**హైదరాబాద్,అక్టోబర్ 1,ప్రభాతవార్త:** ప్రభుత్వం ఫీజ్ రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల మళ్లీ సమ్మె బాట పట్టనున్నాయి. బుధవారం అత్యవసర సమావేశం నిర్వహించిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ వైఖరిపై మీడియా సమావేశం ఏర్పాటు చేశాయి. ఎఫ్ఏటీహెచ్ఐ ఛైర్మన్ రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి విద్యారంగం ఆఖరి ప్రాధాన్యతగా ఉందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వ విడుదల చేయలేదని, గత నెల 21, 22 తేదీల్లో రూ.600 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చినా బకాయిలు చెల్లించలేదని, రూ.200 కోట్లు నిధులు మాత్రమే విడుదల చేశారని తెలిపారు. దీపావళి పండగ లోపు రూ.1,200కోట్లు ఇస్తామన్నారని, ఎలా ఇస్తారో చెప్పాలని >>2




# కేంద్ర ఉద్యోగులకు 3% డిఎ పెంపు

### 49.2 లక్షలమంది ఉద్యోగులు.. 68.7 లక్షలమంది పెన్షనర్లకు లబ్ధి

### 3 నెలల డిఎ బకాయిలు.. అక్టోబరు నెల వేతనంతో చెల్లింపు

### కేంద్ర కేబినెట్ నిర్ణయం: సమాచార మంత్రి అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ, హైదరాబాద్, అక్టోబర్ 1:** దసరా, దీపావళి పండుగల వేళ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కరవు భత్యం (డీఏ), డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్)లను 3 శాతం పెంచుతూ కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన బుధవారం నాడు జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర సమాచార, >>2

### కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాలు: కేంద్రం

# మేడిగడ్డ పునరుద్ధరణ!

### దృష్టి సారించిన ప్రభుత్వం

### అన్నారం, సుందిళ్లకూ రిపేర్లు

### కాంట్రాక్టు దరఖాస్తులకు ప్రకటన జారీ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు1:** కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ పునరుద్దరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దీంతో పాటు అన్నారం,సుందిళ్ల బ్యారేజీల రిపేర్లనూ చేయించనుంది. ఇందు కోసం నేషనల్ డ్యాంసేఫ్టీ అథారిటీ(ఎన్‌డిఎస్‌ఏ) సూచనల మేరకు డిజైన్లు, డ్రాయింగులు సిద్దం చేసేందుకు కాంట్రాక్టు సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ టెండర్ ప్రకటన జారీ చేసింది. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాక్ కుంగింది. సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లోనూ భారీగా సీపేజీలు బయటపడ్డాయి. ఈ రెండు బ్యారేజీలకు తాత్కాలికంగా మరమ్మతులు చేసినప్పటికీ నీటి నిల్వకు అవకాశం లేకుండా పోయింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు లేఖ రాయగా, సిడబ్ల్యుసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో నిపుణుల కమిటీ గత ఏడాది మే నెలలో ప్రాథమిక నివేదిక ఇచ్చింది. డిజైన్లు, నిర్మాణం, నాణ్యత,అపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సహా అనేక వైఫల్యాలున్నట్లు గుర్తించింది. బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడానికి వీల్లేదని,అలా చేస్తే మరింత నష్టం వాటిల్లుతుందని పేర్కొంది.ఈ మేరకు కొన్ని డిజైన్లు,డ్రాయింగ్‌లనూ సూచించింది. ఈ మేరకు మేడిగడ్డ,అన్నారం,సుందిళ్ల బ్యారేజీల పునరుద్దరణ, రెస్టోరేషన్ డిజైన్ల కోసం ప్రసిద్ధ డిజైన్ ఏజెన్సీల నుంచి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్‌ను ఆహ్వానించింది. సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయానికి డిజైన్ ఏజెన్సీలు తమ ప్రతిపాదనలను సీల్ చేసిన కవర్లలో అక్టోబర్ 15 మధ్యాహ్నం 3 గంటలలోపు సమర్పించాలి. అదే రోజు సాయంత్రం 5 గంటలకు జలసౌధ భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ కవర్లు ఓపెన్ చేస్తారని తెలిపింది. ఈ ప్రక్రియలో ఎంపికైన ఏజెన్సీలు ఎన్‌డిఎస్‌ఏ కమిటీ సూచనల మేరకు బ్యారేజీల పనరుద్దరణ డ్రాయింగ్‌లు,డిజైన్లు సిద్ధం చేయాల్సి ఉంటుందని పేర్కొంది. పూర్తి వివరాలను నీటిపారుదల శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. సీబీఐ చేతిలో..కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవకతవకలపై కాంగ్రెస్ సర్కార్ విచారణకు ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఇటీవల విచారణ ముగించిన ఘోష్ కమిషన్.. ప్రభుత్వానికి దాదాపు 600 పేజీలతో అందించింది. కమిషన్ ఇచ్చిన నివేదికను అసెంబ్లీలో చర్చకు పెట్టిన సీఎం రేవంత్ రెడ్డి.. నివేదిక ఆధారంగా >>2




## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ 4కు వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు1:** ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్గడ్డం ప్రసాద్ కుమార్ తన విచారణను కొనసాగించారు. బుధవారం స్పీకర్ ఛాంబర్లో ట్రిబ్యునల్ పదవ షెడ్యూల్ కింద ఈ విచారణ కొనసాగింది. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు వారి న్యాయ వాదులు, వారిపై ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల న్యాయవాదులు విచారణకు హాజరయ్యారు. అయితే విచారణకు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాలేదు. వారితరుపున న్యాయవాదులు హాజరయ్యారు. కాగా, బుధవారం నలుగురు ఎమ్మెల్యేలను విచారిస్తామని ప్రకటించిన స్పీకర్ చివరికి ఇద్దరినే విచారించారు. క్రాస్ ఎగ్జామినేషన్ సమయంలో పిటీషనర్ల తరఫున న్యాయవాదులు తిప్పి తిప్పి ప్రశ్నలు అడగడంతో సమయం పూర్తియింది. మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేలు విచారణకు తగిన సమయం లేకపోవడంతో, విచారణను అక్టోబర్ 4వ తేదీకి వాయిదా వేశారు. బుధవారం యప్రకాశ్ గౌడ్, కాలే యాదయ్యల విచారణ పూర్తియింది. గూడెంమహిపాల్‌రెడ్డి,బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి విచారణ వాయిదా పడింది. గత సోమవారం >>2

# సాఫీగా 'స్థానిక' సమరం

### నక్సలైట్లు ఆయుధాలు వీడితే సహకరిస్తాం

### బేసిక్ పోలీసింగ్ మరింత పటిష్టం

### మీడియాతో కొత్త డిజిపి శివధర్ రెడ్డి



బుధవారం డిజిపిగా బాధ్యతలు స్వీకరిస్తున్న శివధర్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్ర నూతన డిజిపిగా బత్తుల శివధర్ రెడ్డి బుధవారం ఉదయం బాధ్యతలు చేబట్టారు. ఇంఛార్జి డిజిపిగా వున్న మహేష్ భగవత్ నుంచి ఆయన బాధ్యతలు చేబట్టారు. ఈ సందర్భంగా శివధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కొత్త డిజిపిగా తన ముందు ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు సవాల్‌గా వున్నాయని అయితే వీటిని ఎక్కడా చిన్నపాటి లోటు లేకుండా విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన వెలువడిందని, ఈ క్రమంలోనే దానికి అనుగుణంగా బందోబస్తు చేబడతామని ఆయన తెలిపారు. రాష్ట్రం లో పోలీసు వ్యవస్థ బాగానే వుందని, ఎన్నికలు సాఫీగా నిర్వహించేందుకు ఇది ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. క్షేత్రస్థాయి పోలీస్ మరింత మెరుగు పరుస్తామని, దీనికి సాంకేతితను మరింత జోడిస్తామని ఆయన తెలిపారు. దీనివల్ల పోలీసుల్లో వృత్తి నైపుణ్యత మరింత పెరిగి, మెరుగైన ఫలితాలు సాధించే వీలుందని డిజిపి తెలిపారు. రాష్ట్రంలో 17 వేలకు పైగా పోలీసు ఖాళీలు వున్నాయని, వీటిని వెంటనే భర్తీ చేసేందుకు సర్కారు అనుమతిని >>2

### ఐ బొమ్మపై పోలీసుల దృష్టి 5



# స్థానిక ఎన్నికల్లో 71 ఫ్రీ సింబల్స్

**హైదరాబాద్,అక్టోబరు 1,ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో 71 ఫ్రీసింబల్స్‌ను ఎన్నికల సంఘం ప్రకటించింది. రాష్ట్రంలో గుర్తింపు లేని, రిజిస్టర్ అయిన పార్టీలు లేదా ఇండిపెండెంట్ అభ్యర్థులు ఈ ఫ్రీ సింబల్స్ ఎంచుకోవచ్చు.అయితే బిఆర్ఎస్ అభ్యంతరం చెప్పిన, కారు గుర్తును పోలిన సింబల్స్ ఫ్రీ సింబల్స్ కూడా ఈ జాబితాలో ఉన్నాయి. గతంలోనే బిఆర్ఎస్ కారు గుర్తును పోలిన వాటిని ఫ్రీ సింబల్స్‌లో తొలగించాలంటూ గత జులైలో వినతి పత్రం సమర్పించింది.అయితే ఆ వినతిని ఎన్నికల సంఘం పరిగణలోకి తీసుకోనట్లు కనిపిస్తున్నది. రాష్ట్రంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాలుగు జాతీయ పార్టీలు, నాలుగు ప్రాంతీయ పార్టీలు, ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు పొంది తెలంగాణలో రిజిస్టర్ చేసుకున్న మూడు పార్టీలు,వాటి గుర్తులను ఎన్నికల సంఘం ప్రకటించింది. కాంగ్రెస్, బీజేపీ, ఆప్, సీపీఎంలు జాతీయ పార్టీలుగా, ఎంఐఎం, బీఆర్ఎస్, టీడీపీ, వైసీపీలతోపాటు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన గాజుగ్లాస్ గుర్తుతో జనసేన, కంకి కొడవలితో సీపీఐ, సింహం గుర్తుతో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలను గుర్తులతో కూడిన పార్టీలుగా ప్రకటించారు. గుర్తులు లేకుండా ఎన్నికల సంఘంలో రిజిస్టర్ అయిన పార్టీలు 71 ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ పార్టీల నుంచి అభ్యర్థులు పోటీ చేయడానికి గాను 71 ఫ్రీసింబల్స్‌ను విడుదల చేసింది. వీటితోపాటు నోటా గుర్తుకూడా బ్యాలెట్ పేపర్ చివరన ఉండనుంది. ఇండిపెం డెంట్, రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు నామినేషన్ సమయంలో వారికి ఏ గుర్తు కావాలో ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ అభ్యంతరం తెలిపిన పలు గుర్తులను ఫ్రీ సింబల్స్ జాబితాలో పొందుపరిచారు. చపాతి రోలర్, కెమెరా, షిప్ గుర్తులు సైతం ఫ్రీ సింబల్స్ జాబితాలో ఉన్నాయి.

# గవర్నర్, సిఎంతో భేటీ అయిన డిజిపి శివధర్ రెడ్డి



బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన శివధర్‌రెడ్డి, సజ్జన్నార్, విజయ్‌కుమార్

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** నూతన డిజిపిగా బుధవారం ఉదయం బాధ్యతలు చేబట్టిన శివధర్ రెడ్డి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను మర్యాద పూర్వకంగా కలిశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయిన శివధర్ రెడ్డి అనంతరం సిఎం రేవంత్ రెడ్డిని కూడా కలిశారు. దీని తరువాత చీఫ్ సెక్రటరీ రామకృష్ణా రావుతోనూ, గుడ్ గవరెన్స్ డిజిగా నియమితులైన రవి గుప్తాను కూడా కలిశారు. డిజిపి శివధర్ రెడ్డి భేటీ అయ్యారు. చీఫ్ సెక్రటరీ తో భేటీ సమయంలో నిఘా విభాగం నూతన బాస్‌గా బుధవారం బాధ్యతలు చేబట్టిన విజయ్‌కుమార్, సిటీ కొత్వాల్ సజ్జన్నార్ కూడా ఉన్నారు.

**నిఘా విభాగం బాస్‌గా బాధ్యతలు చేబట్టిన విజయ్ కుమార్**

ఇదిలావుండగా నిఘా విభాగం అదనపు డిజిగా విజయ్ కుమార్ బుధవారం ఉదయం బాధ్యతలు చేబట్టారు. అనంతరం ఆయన డిజిపి శివధర్ రెడ్డితో భేటీ అయ్యారు. కాగా విజయ్‌కుమార్‌ను నిఘా విభాగం ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

**ఎసిబి బాస్‌గా బాధ్యతలు చేబట్టిన చారు సిన్హా**



ఎసిబి బాస్‌గా నియమితులైన చారు సిన్హా బుధవారం బాధ్యతలు చేబట్టారు. బంజారాహిల్స్‌లోని ఎసిబి ప్రధాన కార్యాలయంలో ఆమె బాధ్యతలు చేబట్టారు. ఈ సందర్భంగా ఎసిబి ఉన్నతాధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.


# ఆసియాన్ సదస్సులోనే ట్రంప్ మోడీ భేటీ

## ఆ తర్వాతే భారత్‌లో పుతిన్‌తో కీలక చర్చలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 1:** మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగే ఆసియాన్ సదస్సు సందర్భంగా ప్రధాని మోడీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌తో భేటీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 47వ ఆసియాన్ సదస్సు ఈనెల 26,27 తేదీల్లో మలేసియాలో జరుగుతోంది. మలేసియా ఆహ్వానం మేరకు అధ్యక్షుడు ట్రంప్ ఈసదస్సుకు హాజరవుతారని ఆదేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీం చెపుతున్నారు. ట్రంప్ తన పర్యటనను ధృవీకరిస్తే తొలి అంతర్జాతీయ ఆసియాన్‌సదస్సులో రెండు అగ్రదేశాల నేతలు భేటీ అవుతున్నట్లవుతుంది. అమెరికా 50శాతం సుంకాలు విధించిన తర్వాత ఇరుదేశాల నేతలు ఆసియాన్ సదస్సు సందర్భంగా తొలిసారి కలుసుకున్నట్లవుతుంది. ట్రంప్ భారత్‌పై 50శాతం సుంకాలు ప్రకటించిన తర్వాత రెండుదేశాలమద్య సంబంధాలు బెడిసికొట్టాయి. అంతేకాకుండా అమెరికా మన శతృదేశం పాకిస్తాన్‌కు చేరువవుతూ వచ్చింది. మాస్కోతో ఇంధన సంబంధాలపై ట్రంప్ భారత్‌పట్ల గుర్రుగా ఉన్నసంగతి తెలిసిందే. ప్రత్యేకించి ముడిచమురు దిగుమతులను నిలిపివేయాలంటూ ఒత్తిడిని కూడా పెంచారు.వైట్‌హౌస్‌ప్రతినిధి పీటర్ నవారో కూడా భారత్‌పై అవాకులు చవాకులు పేలిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి భారత్ నిధులు అందిస్తోందని, ముడిచమురును చౌకగా కొని ఇతర దేశాలకు అధికధరలకు విక్రయిస్తోందంటూ ట్రంప్ ధ్వజమెత్తిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌పై చర్చలు కొలిక్కిరాకపోయినా గాజాతో మాత్రం ట్రంప్ చర్చలు ఫలప్రదం చేసారు. గాజాపై కాల్పుల విరమణకు ఎట్టకేలకు ఇజ్రాయెల్ దిగివచ్చింది. ఈ సదస్సులో ట్రంప్‌తో చర్చలు జరిపిన తర్వాతనే డిసెంబరు ఐదు, ఆరు తేదీల్లో భారత్‌లో పర్యటించే పుతిన్‌తో ప్రధాని మోడీ కీలక చర్చలుంటాయన్న భావన రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతోంది.

# జిఎస్టీ రాబడులు రూ.1.89 లక్షలకోట్లు

## గత యేడాదితో పోలిస్తే 9.1% వృద్ధి




**న్యూఢిల్లీ,అక్టోబరు 1:** దేశంలో జిఎస్టీ వసూళ్లు సెప్టెంబరునెలలో పెరిగాయి. వార్షికపద్ధతిలో చూస్తే గత ఏడాది ఇదేనెల వసూళ్లకంటే 9.1శాతం పెరిగినట్లు ఆర్థికశాఖ ప్రకటించింది. సెప్టెంబరునెలకుగాను 1.89 లక్షలకోట్లు వసూళ్లు వచ్చినట్లు తేలింది. ఇటీవల జిఎస్టీ శ్లాబుల హేతుబద్ధీకరణ తర్వాత ఈ ఆదాయం మరింతపెరిగిందని ప్రభుత్వం చెపుతోంది. జిఎస్టీ 2024 సెప్టెంబరు 1.73 లక్షలకోట్లుగా ఉంటే ఆగస్టులో 1.86 లక్షలకోట్లుగా ఉంది. దేశీయ రాబడులు 6.8శాతంపెరిగి 1.36 లక్షలకోట్లుగా ఉన్నాయి. జిఎస్టీ దిగుమతులద్వారా 15.6శాతంపెరిగి 52,492 కోట్లకుచేరింది. జిఎస్టీ హేతుబద్ధీకరణ తర్వాతకూడా వసూళ్లు పెరిగాయంటే ఈ ప్రభావం ఆర్థిక వ్యవస్థపై ఎంతమాత్రం లేదని, లావాదేవీలు మరింతపెరిగినట్లు తెలుస్తోందని డెల్లాయిట్ ఇండియా ఎంఎస్ మణి తెలిపారు. రీఫండ్‌లు కూడా 40.1శాతంపెరిగి 28,657 కోట్లకుచేరాయి. దీనితో జిఎస్టీ రాబడులు 1.60 లక్షలకోట్లుగా నిలిచింది. వార్షికవృద్ధిప్రకారంచూస్తే ఐదుశాతం వ1ద్ధిని నమోదు చేసింది. దేశీయంగాను, ఎగుమతు రీఫండ్లు పెరుగుతూనే ఉండటం లావాదేవీలు పెరుగుదలను సూచిస్తున్నట్లు మణి అన్నారు. మహారాష్ట్ర, గుజరాత్, తమిలనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో జిఎస్టీ రాబడులు రెండంకెల వృద్ధిని దాటలేదని ఈఏడాది అనేకనెలల్లో ఇదే చోటుచేసుకున్నట్లు మణిచెప్పారు.

# శ్రీశైలం డ్యాం 205టీఎంసీలు: 10గేట్లు ఎత్తి సాగర్‌కు నీటివిడుదల

## జూరాల 20గేట్లు ఎత్తివేత

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 1, ప్రభాతవార్త:** కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానదీ పోటెత్తుతున్నది. దీంతో కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. శ్రీశైలండ్యాం నిండుకుండలా మారాయి. బుధవారం సాయంత్రం 6గంటల సమాచారం మేరకు డ్యాం నీటిమట్టం 885అడుగులకుగాను 883.20 అడుగులకు చేరింది. డ్యాం సామర్థ్యం 215.8070టీఎంసీలకు 205.2258టీఎంసీలకు చేరింది. జలాశయానికి జూరాల స్పిల్‌వే ద్వారా 3,22,360క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 24,567క్యూసెక్కులు,హంద్రీ నుంచి 3750క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. శ్రీశైలం జలాశయంలోని ఎడమ,కుడి విద్యుదుత్పత్తి కేంద్రాలకు 65,151క్యూసెక్కులు విడుదల చేశారు. డ్యాం 10గేట్లు 16అడుగులు ఎత్తి 389260క్యూసెక్కుల వరద దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి మొత్తంగా 5,30,126క్యూసెక్కుల వరద నాగార్జున సాగర్‌కు విడుదల అవుతున్నది.

# 'ఐబొమ్మ' పై పోలీసుల దృష్టి

## సంచలన ప్రకటన విడుదల చేసిన పైరసీ వెబ్‌సైట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు1:** సినిమాలు, ఒటిటి పైరసీ కేసులో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేస్తున్నారు. తాజాగా థియేటర్‌లో రికార్డ్ చేసే వారితో పాటు.. సర్వర్లు హ్యాక్ చేస్తున్న ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. దర్యాప్తులో ఐబొమ్మ వెబ్‌సైట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు దాని నిర్వాహకులు పోలీసులకు సవాల్ విసిరారు. దానిని ఛాలెంజింగ్‌గా తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు ఆ వెబ్‌సైట్ కోసం పని చేస్తున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌లలో ఐబొమ్మకు ఏజెంట్లు ఉన్న గుర్తించారు. ఈ కాగా, ఆ పైరసీ వెబ్‌సైట్ తెలుగులో బుధవారం ఓ ప్రకటనను వెలువరించింది. సినిమాలకు అనవసర బడ్జెట్ పెట్టి దాని రికవరీ ప్రేక్షకులపై రుద్దుతున్నారని ఐబొమ్మ ప్రకటనలో పేర్కొంది. దీని వల్ల చివరికి సాధారణ ప్రేక్షకుడు, ముఖ్యంగా మధ్య తరగతివాడే బాధపడుతున్నాడని తెలిపింది. కెమెరాల సాయంతో థియేటర్‌లో మూవీలను రికార్డు చేసి ప్రింట్స్ విడుదల చేస్తున్న వెబ్‌సైట్లపై దృష్టి పెట్టాలని సూచించింది. తాము ఏ దేశంలో ఉన్న భారత దేశం, అందులోనూ తెలుగు వారి గురించి ఆలోచిస్తామంటూ చెప్పింది. ఓటీటీ కంటెంట్‌ను తస్కరిస్తూ నిర్వాహకులకు తలనొప్పిగా మారడంతో ఐబొమ్మని కట్టడి చేసేందుకు పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ఈ క్రమంలో ఆ పైరసీ వెబ్‌సైట్ నుంచి ఓ ప్రకటన వచ్చిందటూ సోషల్ మీడియాలో వేదికగా వైరల్‌గా మారింది. సినిమా పరిశ్రమకు పెను సవాల్‌గా మారిన పైరసీ ముఠాను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. దేశంలోనే అతి పెద్దదైన ముఠాను ఛేదించి ఆరుగురిని అరెస్టు చేశారు. తెలుగు సహా పలు భాషల సినిమాలను పైరసీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీని ద్వారా సినిమా ఇండస్ట్రీకి దాదాపు రూ.3,700 కోట్లు నష్టం జరిగిందని పోలీసులు తెలిపారు.గతంలో హ్యాష్ ట్యాగ్ సింగిల్ సినిమా పైరసీపై పోలీసులకు కంప్లైంట్ అందింది. దీనిపై విచారణ చేపట్టి నిందితుడిని జులై 3న రంగారెడ్డి జిల్లా వనస్థలిపురంనకు చెందిన కిరణ్‌ను అరెస్టు చేశారు. అతడిని కస్టడీలోకి తీసుకుని విచారించగా, ఆ పైరసీ ముఠా సభ్యులు నెదర్లాండ్, దుబాయ్, మయన్మార్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఈటీవీ విన్ కంటెంట్‌ను పైరసీ చేసి అమ్ముకున్న మరో నిందితుడిని అరెస్టు చేశారు. ఇలా రికార్డ్ చేసి ఒరిజినల్ కంటెంట్‌ను తీసుకుని ఇతర వెబ్‌సైట్లకు ముఠా విక్రయిస్తోంది. థియేటర్లలో ప్లే అయ్యే శాటిలైట్ కంటెంట్ ఐడీ, పాస్‌వర్డ్‌లను సైతం నేరగాళ్లు క్రాక్ చేస్తున్నారు. కొన్ని సార్లు క్రాక్ అవ్వని పక్షంలో ఏజెంట్లకు కెమెరాలు అందజేసి, రహస్యంగా రికార్డు చేయడాన్ని నేర్పిస్తున్నారు. అనంతరం ఆ ఏజెంట్లకు టికెట్లు బుక్ చేసి మరీ థియేటర్లలో సినిమాలు రికార్డ్ చేస్తున్నారు. చొక్కా జేబు, పాప్ కాన్ డబ్బా, కోక్ టిన్‌లలో కెమెరాలు పెట్టి చిత్రీకరిస్తున్నారు. ఏజెంట్లకు క్రిప్టో కరెన్సీ రూపంలో నిందితులు కమీషన్లు ఇస్తున్నారు. కేవలం తెలుగు సినిమాలే కాదు, తమిళ్, మళయాళం, హిందీ సినిమాలపై నేరగాళ్లు ప్రత్యేక దృష్టి పెట్టారు.

# పైశాచికానందం కోసం నన్ను అరెస్ట్ చేశారు: ఎంపి మిధున్‌రెడ్డి

**తిరుపతి రూరల్, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** కూటమి నాయకులు తమ పైశాచిక ఆనందం కోసమే తనను అక్రమంగా అరెస్ట్ చేశారని రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఎంపి స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండానే అక్రమంగా అరెస్ట్ చేసి 73 రోజులు జైల్లో పెట్టారని వాపోయారు. కేసులు తనకేమీ కొత్తకాదనీ, చదువుకునే రోజుల్లోనే తనపై అక్రమ కేసులు బనాయించారని గుర్తు చేశారు. తాను ఇంజినీరింగ్ చదివేరోజుల్లో నాటి టిడిపి ప్రభుత్వం తనపై మొదటి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# తిరుమల సమాచారం

## అశ్వవాహనంపై కలియుగదైవం



**తిరుమల,అక్టోబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠంలో శ్రీవేంకటేశ్వరస్వామిగా ఆవిర్భవించి భక్తులను కాపాడుతున్న కలియుగ ప్రత్యక్షదైవం శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి చివరగా అశ్వవాహనంపై భక్తులను కటాక్షించాడు. కలియుగాంతంలో స్వామి కల్కిమూర్తియై గుర్రంపై పయనిస్తూ ,ఖడ్గధారియై దుష్టశిక్షణం, శిష్టరక్షణం చేస్తాడని పురాణాలు పేర్కొన్నాయి. ఆధ్యాత్మికంగా పరమాత్మే అశ్వం. ఆయనే మనహృదయంలోవుండి ఇంద్రియాల్ని నియమిస్తున్నాడు. శ్రీహరి శ్రీనివాసుడై ఈ లోకంలో వేంకటాచలం చేరి అటునుండి పద్మావతిదేవిని పెండ్లాడటానికి మొట్టమొదట వేటనెపంతో గుర్రంపైనే వచ్చాడట. స్వామివారు అశ్వంపై కూర్చుని తన వేగశక్తిని, బలశక్తినీ నిరూపిస్తుంటారు. వేగశక్తి అశ్వలక్షణం. రథాన్ని లాగేవి గుర్రాలే. బుధవారం రాత్రి అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు చివరగా అశ్వవాహనంపై విహరించాడు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు,బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శాంతారాం,నరేశ్, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, జెఈఓ వీరబ్రహ్మం, సిఇ సత్యనారాయణ భక్తులు పాల్గొన్నారు.

# రేపు డయల్ యువర్ 'టిటిడి ఇఓ' కార్యక్రమం పునఃప్రారంభం



**తిరుమల,అక్టోబర్ 1 ప్రభాత వార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చిన భక్తులకు వెంకన్న దర్శనంలో గానీ, వసతి కల్పనలో ఎదురైన అనుభవాలు, ఇబ్బం దులు, తమతమ సూచనలు,సలహాలు తెలిపేందుకు ప్రతినెలా మొదటి శుక్రవారం తిరుమలలో "డయల్ యువర్ ఇఓ"కార్యక్రమం జరగ నుంది. దేశవిదేశాల్లోని భక్తులు తమతమ ఫిర్యాదులు, సూచనలను శుక్రవారం ఉదయం 9నుంచి 10గంటల వరకు 0877-2263261 నంబర్లకు ఫోన్‌ద్వారా నేరుగా టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్‌తోమాట్లాడే అవకాశం కలుగుతుంది. పరిపాలనపరమైన కారణాలతో గతంలో ఈ కార్యక్రమం నిర్విరామంగా సాగలేదు. ఇటీవల నూతనంగా ఈఓగా సింఘాల్ రాకతో పునరుజ్జీవం కలిగిస్తున్నారు.

# బ్రహ్మోత్సవాల్లో ఒక్కరోజే 16రకాల ఆహారపదార్థాలు

## - అన్నప్రసాదాల పంపిణీపై 99శాతం సంతృప్తి




**తిరుమల,అక్టోబర్ 1ప్రభాత వార్త ప్రతినిధి:** సాధారణ రోజుల్లోనే తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాదభవనంతోబాటు మినీ అన్నప్రసాదం భవనంలో, ఫుడ్‌కోర్టలలో 1.20లక్షలమంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తుండటం విశేషం. అలాంటిది ఇలవైకుంఠంగా తలపించే తిరుమలలో దేవదేవుని సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు అత్యంత విశేషమైన గరుడసేవరోజు మాత్రమే 16 రకాల ఆహారపదార్థాలతో 9.28లక్షలమంది భక్తులకు అన్నప్రసాదాలు అందించడం రికార్డుస్థాయి అని అన్నప్రసాదంవిభాగం డిప్యూటీ ఈఓ ఎం.రాజేంద్రకుమార్ తెలిపారు. మీడియాసెంటర్‌లో అన్నప్రసాదం వివరాలను తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ఇప్పటివరకు అన్నప్రసాదాల పంపిణీపై 99శాతం మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. భక్తులకు ఈ ఎనిమిదిరోజులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ అన్నప్రసాదం, అల్పాహారం, పాలు, మజ్జిగ భక్తులకు పంపిణీ చేశామన్నారు. దాతలు 23రకాల కూరగాయలను విరాళంగా అందించినట్లు చెప్పారు. గత ఎనిమిదిరోజులు 30లక్షలమందికి అన్నప్రసాదాలు అందించడం జరిగిందన్నారు. అన్నప్రసాదం ప్రత్యేక అధికారి జిఎల్ఎన్ శాస్త్రి మాట్లాడుతూ విశేషమైన గరుడసేవరోజు మాత్రం గ్యాలరీలతోబాటు మాఢవీధుల్లో హోల్డింగ్ పాయింట్ల వద్ద 9.8లక్షలమంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశామని తెలిపారు. గరుడసేవరోజు ప్రతి గంటకు ఒక్కోరకమైన ప్రసాదాన్ని పంపిణీ చేశామన్నారు. శ్రీవారిసేవకులు, పోలీసులు, టిటిడి ఉద్యోగుల సాయంతో గత సంవత్సరంకంటే ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు 33శాతం అదనంగా అన్నప్రసాదాలు పంపిణీ జరిగిందని శాస్త్రి తెలిపారు.

# నేటి ఉదయం 'చక్రస్నానమహోత్సవం'

## - ముగింపునకు చేరుకున్న బ్రహ్మోత్సవాలు

**తిరుమల,అక్టోబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి తొమ్మిదిరోజులు స్వయంగా బ్రహ్మదేవుడు దగ్గరుండి జరిపించే బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం చక్రస్నానమహోత్సవంతో ముగుస్తున్నాయి. బ్రహ్మోత్సవాల్లో సపరివారదేవతలు తిరుమలలోనే ఉంటారని పురాణాల ఆర్యోక్తి. అంతటిపవిత్రమైన ఈ తొమ్మిదిరోజులు భక్తులు కూడా భగవంతుని సేవలో తరిస్తారు. ఎందరో ప్రముఖులు, ధనవంతులు, వివిఐపిలు ఒక్కరేంటి అందరూ ఆ స్వామిసేవలోనే సేవకులుగా తరిస్తారు. గతనెల 24నుండి మొదలైన సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి చివరివాహనంగా అశ్వవాహనంగా జరిగింది. చివరిఘట్టంగా చక్రస్నానమ హోత్సవం నేటి ఉదయం నిర్వహిస్తారు.

# బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు వసతి ప్రాధాన్యత : డిప్యూటీ ఇఒ భాస్కర్

**తిరుమల,అక్టోబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలపై సాధారణరోజుల్లో సామాన్య భక్తులకు 50శాతం గదులు కేటాయిస్తే తొమ్మిదిరోజులు పాటు జరిగిన సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రోజుకు 2,500 గదులు వారికే కేటాయించామని వసతికల్పనవిభాగం డిప్యూటీ ఈఓ భాస్కర్ తెలిపారు. నూతన యాత్రికుల వసతి సముదాయం( వెంకటాద్రినిలయం-పిఎసి 5)బ్రహ్మోత్సవాల్లోనే అందుబాటులోకి రావడంతో 10వేలమంది భక్తులకు వసతి కల్పించేలా ఏర్పాట్లు చేశామన్నారు. 2,400 లాకర్లు భక్తులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. బుధవారం ఉదయం మీడియాసెంటర్‌లో ఆయన మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో విచ్చేసిన విఐపిలకంటే సామాన్యులకే వసతి కేటాయించడం జరిగిందన్నారు.

# 'దివ్యరథంపై దేవదేవుడు'

**తిరుమల,అక్టోబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** భగవంతుడు ఊరేగే వాహనాల్లో రథోత్సవం అన్నివిధాలా శ్రేష్టమైంది. "రథస్తం కేశవం దృష్ట్వా పునర్జన్మవిద్యతే"అనే ఆర్షవాక్కులు రథోత్సవం మోక్షప్రదాయకమని వివరిస్తాయి.ఆత్మరథికుడు, శరీరమే రథం. బుద్ధి సారధి, మనస్సు పగ్గం.ఇంద్రియాలే గుర్రాలు. విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంలో పోల్చడంతో స్థూలశరీరం వేరని, సూక్ష్మశరీరం వేరని,ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. కలియుగవైకుంఠం ఏడుకొండలపై దేవదేవుని సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదోరోజు బుధవారం ఉదయం మహోన్నత దివ్యరథంపై భూదేవిశ్రీదేవిసమేత మలయప్పస్వామి భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం ఆలయంలోపల నిత్యకైంకర్యాలు పూర్తిచేసుక్ను తరువాత ఆలయంనుండి సర్వాంగసుందరంగా విశేషభర ణాలు, తులసీమాలలు,వివిధ రకాల పుష్పాలమాలలు ధరించి ఉభయదేవేరులతో కలసి మలయప్పస్వామి ఆలయంముందుకు వేంచేపుచేశారు. ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, వాహన ఇన్‌స్పెక్టర్,ఆలయ అర్చకులు మంగళ వాయిద్యాల నడుమ ఆలయం ముందు రథంపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. ఉదయం 7గంటలకు ఇక్కడ వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామివారిని బంగారు గొడుగు అమర్చిన మహోన్నరథంపై అధి రోహింపజేశారు. అర్చకులు కర్పూర హారతు లిచ్చి ఆలయమాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది.

# బొబ్బిలి కోటలో వైభవంగా ఆయుధ పూజ

**బొబ్బిలి అక్టోబర్1 ప్రభాతవార్త:** బొబ్బిలి కోటలో ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాల్లో భాగంగా ఆయుధపూజ బొబ్బిలి రాజ వంశీయులు అంగరంగ వైభవంగా జరిపారు. బొబ్బిలి కోటలో ఉన్న ఆనాటి బొబ్బిలి యుద్ధం ఆయుధాలను ప్రతి సంవత్సరం మాదిరిగా రాజవంశీయులు విజయ్ కృష్ణ రంగా రావు రామకృష్ణ రంగారావు ఆర్ వి ఎస్ ఎస్ కె రంగారావు (బేబీ నాయన) ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విజయదశమి పూజలు నిర్వహించారు.

# సెప్టెంబర్‌లో వందకోట్లు దాటిన హుండీ ఆదాయం

## బ్రహ్మోత్సవ రోజుల్లో తగ్గిన కానుకలు

**తిరుమల,అక్టోబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠవాసు డు.. ..అత్యంత సంపన్న వంత మైన దేవుడు తిరుమలేశునికి సెప్టెంబర్‌నెలలోనూ హుండీ ఆదాయం వందకోట్లు రూపా యలు దాటింది. గతనెల 24వతేదీ నుండి 30వరకు తొమ్మిదిరోజుల బ్రహ్మోత్స వాల్లో ఎనిమిదిరోజులకుగాను హుండీ కానుకలు కొంత తగ్గింది. ఎనిమిదిరోజులు కానుకల ద్వారా భక్తులు వెంకన్న హుండీకి 28కోట్ల రూపాయల వరకు ముడుపులు సమర్పించుకున్నారనేది తెలుస్తోంది. 30రోజులకుగాను 107.44కోట్ల రూపాయలు ఆదాయం చేకూరింది. బ్రహ్మోత్సవాల్లో రెండవరోజు సెప్టెంబర్ 25వతేదీ 1.74కోట్లు, 26న మూడోరోజు 2.58కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది.ఇక మిగిలిన ఆరురోజులు మూడుకోట్లు మార్కుదాటింది. ఇక భక్తులు దర్శనాలకు సంబంధించి నెలంతా 21కోట్లమంది భక్తులు స్వామివారిని దర్శించుకోగలిగారు. తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాల్లోనే 6.50లక్షలమంది భక్తులకు మూలవిరాట్టుతోబాటు వాహనసేవల దర్శనం టిటిడి కల్పించింది. అయితే సెప్టెంబర్‌నెలలో 107.44కోట్లు ఆదాయం చేకూరగా, 21లక్షలమంది భక్తులు దర్శనం చేసుకున్నారు. గత ఏడాదికంటే కొంత తగ్గిందనేది టిటిడి వర్గాల అంచనా. అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడ్ని సేవించుకునేందుకు దేశవిదేశాల్లోని భక్తులు తమ ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు భారీగా తరలివస్తున్నారు. మరీ బ్రహ్మోత్సవాల్లోనూ భక్తులు తగ్గుముఖం పట్టలేదు. హుండీ కానుకలు మాత్రం తగ్గాయి.

సాదారణంగానే తిరుమలకు వచ్చిన భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా కానుకల రూపంలో హుండీకి నగదు,నగలు సమర్పించుకోవడం కనిపిస్తోంది. భక్తుల రద్దీతో బాటు మొక్కుబడుల రూపంలో కానుకలు హుండీకి భారీగానే నెలనెలా చేకూరడం విశేషం. గడచిన నెలలో ప్రతిరోజూ సరాసరి 3.50-4కోట్లురూపాయలు వరకు హుండీ ఆదాయం లభించింది. బ్రహ్మోత్సవాల్లో 24న 3.01కోట్లు రూపాయలు, 25న 1.74కోట్లు, 26న 2.58కోట్లు, 27న 3.36కోట్లు, 28న 3.79కోట్లు, 29న 4.14కోట్లు రూపాయలు, సెప్టెంబర్ 30న 3.77కోట్లరూపాయలు సమకూరింది. సాదారణరోజుల్లో 20వతేదీ 4.59కోట్లు, 1న 4.03కోట్లు,12న 4.15కోట్లు ఇలా వరుసగా రోజుకు 3.50కోట్లరూపాయలు దాటిన రోజులే ఎక్కువ.

# విజయవాడ గాంధీ హిల్‌కు కొత్తకళ

## నేడు ఎపి సిఎం చంద్రబాబు రాక

**విజయవాడ,అక్టోబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ గాంధీ హిల్‌కు కొత్తకళ సంతరించుకుంది. గాంధీ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు తొలిసారిగా కొండపై పర్యటించి గాంధీ స్మారకస్థూపం నుండి బెజవాడ అందాలను వీక్షించనున్నారు. గాంధీ హిల్‌పై ఇప్పటికే భద్రత ఏర్పాటలను కట్టుదిట్టం చేశారు. గాంధీ హిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను చేపట్టారు. ఇప్పటికే అక్కడ నూతనంగా జంబో లెఫ్ట్‌ను నిర్మించారు. కొండ మిడిల్ డౌన్ నుండి స్మారకస్థూపం వరకు లిఫ్ట్ నిర్మించారు. విజయవాడ వ్యూ పాయింట్‌ను సందర్శించేలా ఏర్పాటు చేసిన నూతన లిఫ్ట్, ట్రైన్, పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. గాంధీ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు గాంధీ హిల్‌పై పర్యటించనున్నారు. తొలిసారిగా సీఎం చంద్రబాబు గాంధీ స్మారకస్థూపం సందర్శించనున్న ఈ నేపథ్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఒక్కప్పుడు గాంధీ స్థూపం చేరుకోవాలంటే ఫూట్ రోడ్డులో వెళ్లాలి. కానీ అది కొండ పైవరకు లేదు. కొండ శిఖరాగ్రంలో ఉన్న గాంధీ స్మారకస్థూపం వరకు వెళ్లాలంటే మెట్ల మార్గం ఒక్కటే దిక్కు. అయితే పర్యాటకులకు ఇది ఇబ్బందిగా ఉందని గాంధీ హిల్ నిర్వాహకులు జంబోలను నిర్మించారు.. చరిత్ర కలిగిన గాంధీ హిల్‌ను పూర్వవైభవం తీసుకొచ్చే ప్రణాళికలు చేస్తున్నారు..విజయవాడ నగరం ఆధ్యాత్మికంగా, చారిత్మకంగా, సాంస్కృతికంగా ఎంతో గొప్ప ప్రాధాన్యత కలిగిన ప్రదేశం. ఇక్కడ ఒకవైపు ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ, మరోవైపు గుణదల మేరిమాత కొండ, గాంధీ కొండలు విశేష ఖ్యాతిని పొందాయి. వీటిలో అతి ముఖ్యమైనది గాంధీ హిల్, ఎన్నో ప్రత్యకతలతో నిలుస్తోంది. మహాత్మగాంధీ స్మారకార్థంగా నిర్మించబడినన గాంధీ హిల్ కొండ దశాబ్దాలుగా లక్షలాది మంది సందర్శకులతో ఆకర్షిస్తుంది. మహాత్మగాంధీ మరణానతరం ఆయన జ్ఞాపకార్థం దేశవ్యాప్తంగా అనేక స్మారక చిహ్నాలు నిర్మించబడాయి. కానీ గాంధీ హిల్‌పై మహాత్మ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయకపోవడంతో ఈ క్రమంలో విజయవాడ రైల్వేస్టేషన్ పశ్చిమ ద్వారం సమీపంలో ఉన్న గాంధీ హిల్ కొండపైస్మారక స్థూపాన్నీ నిర్మించాలని ముమ్మర ఏర్పాటు చేపట్టారు.

# యు పి ఎస్ పెన్షన్ ఆప్షన్ల గడువు నవంబర్ వరకు పొడిగింపు..

**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 01, ప్రభాత వార్త:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయబోతున్న ఏకీకృత పెన్షన్ పథకం (యూ పి ఎస్)లో చేరాలనుకునే కేంద్ర ప్రభుత్వ (రైల్వే) సిబ్బంది తమ తమ ఎంపిక దరఖాస్తులను (ఆప్షన్స్ ఫారాలను) నవంబర్ 30లోగా తాము పనిచేస్తున్న కార్యాలయాల్లో అందజేయాలని రైల్వేవర్గాలు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వశాఖలలో పనిచేస్తున్న 24 లక్షల మంది సిబ్బంది వారు పొందే వేతనంలో యాభై శాతం పెన్షన్ గా పొందే కేంద్ర ప్రభుత్వ ఏకీకృత పెన్షన్ (యూనిఫైడ్ పెన్షన్ పథకం) పథకాన్ని అమలు చేసే క్రమంలో సెప్టెంబర్ 30 లోగా తమ తమ ఆప్షన్స్ ఫారాలను ఇవ్వాలని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే వివిధ వర్గాల నుంచి కేంద్ర ప్రభుత్వానికి వచ్చిన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వ, రైల్వే సిబ్బంది తాము ఎన్ పి ఎస్ లోనే కొనసాగుతారా? లేక కొత్తగా అమలులోకి వచ్చిన యూ పి ఎస్ పథకంలో చేరుతారా అనే అంశాలపైనే తుదినిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఒంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న యూ పి ఎస్ పథకంలో చేరాలనుకునే వారు తాము పనిచేస్తున్న కార్యాలయాల్లో నిర్దీత దరఖాస్తులను భర్తీచేసి నవంబర్ 30 లోగా అందజేయాలన్నారు. సెప్టెంబర్ 24 నాటికి యూ పి ఎస్ పథకంలో చేరిన కేంద్ర ప్రభుత్వ సిబ్బంది 70,670 మందిపి ఎఫ్ ఆర్ డి ఏ... గత నెల సెప్టెంబర్ 21 నాటికి జాతీయ పెన్షన్ పథకం (ఎన్ పి ఎస్) లో మొత్తం 24,64,437 మంది కేంద్ర ప్రభుత్వ సిబ్బంది ఉండగా,ఈ ఏడాది సెప్టెంబర్ 24 నాటికి యూ పి ఎస్ పథకంలో చేరేందుకు 70,670 మంది ఎంపిక చేసుకోగా (ఆప్షన్ ఇవ్వగా), వీరిలో సివిల్ విభాగం నుంచి 21,366 మంది, తపాలా శాఖ9,996 మంది, టెలికాం130 మంది , రైల్వేశాఖ నుంచి 18,024 మంది, డిఫెన్స్ నుంచి 7,058 మంది సిబ్బంది యూపిఎస్ లో చేరేందుకు ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు.

# దసరా శుభాకాంక్షలు : ఏపి మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ అక్టోబర్ 1, ప్రభాత వార్తప్రతినిధి:** విజయదశమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ విజయదశమి అనేది సత్యం, ధర్మం, న్యాయం చెడుపై సాధించే విజయానికి ప్రతీక. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, సుభిక్షం నింపాలని మన సారా కోరుకుంటున్నాను.

# ఈటల రాజేందర్ క్షమాపణ చెప్పాల్సిందే

## నాకు బిఆర్ఎస్‌తో ఎలాంటి సంబంధం లేదు:కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు1:** బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. బీసీలకు ఎంపీ ఈటల క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలపై కోర్టుకు వెళ్తానని ఈటల రాజేందర్ అనటం తప్పన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ చిత్తశుద్ధికి ఈటల వ్యాఖ్యలు నిదర్శనమన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం అవసరమైతే సొంత పార్టీ బీజేపీతో ఈటల కొట్లాడాలని అన్నారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈటల ఫైటర్ అయి ఉండి.. గౌరవం తగ్గించుకునే విధంగా మాట్లాడారని విమర్శించారు. ఉద్యమకారుడు, బీసీ బిడ్డ ఈటల నుంచి ఇలాంటి వ్యాఖ్యలు దారుణమన్నారు.బీసీ రిజర్వేషన్లను బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు స్వాగతిస్తున్నారని,కానీ ఈటల మాత్రం ఎన్నికల తర్వాత కోర్టుకు వెళ్తానంటున్నారని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లపై కోర్టుకు వెళ్లిన వారు సీఎం రేవంత్ రెడ్డికి దగ్గర వ్యక్తులంటూ వ్యాఖ్యలు చేశారు. బీసీలకు రాజకీయంగా అవకాశం వస్తుంటే కోర్టుకు పోతామని ఈటల ఎలా అంటారని ప్రశ్నించారు. గవర్నర్ దగ్గర పెండింగ్‌లో ఉన్న ఆర్డినెన్స్‌ను బీజేపీ పాస్ చేపించాలని ఆమె డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం బీజేపీకి చెందిన 8 మంది ఎంపీలు మోదీని కలవాలన్నారు. రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లును పాస్ చేయించాలని పేర్కొన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన కులగణన తప్పుల తడక అని విమర్శలు గుప్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభా లేని గ్రామాలను ఆయా వర్గాలకు రిజర్వ్ చేశారన్నారు. రిజర్వేషన్ల ఖరారులో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేసిందని ఆరోపించారు.ఎస్సీ వర్గీకరణ చేశామంటున్న రేవంత్.. రిజర్వేషన్ల కేటాయింపులో వర్గీకరణ పాటించలేదని ఫైర్ అయ్యారు. ఎస్సీల్లో మాదిగలకు ఎన్ని సీట్లు కేటాయించారో ఎందుకు చెప్పలేదని నిలదీశారు. గ్రామ పంచాయతీల వారీగా కులగణనను బయట పెట్టాలని జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు.ఉప ఎన్నికల్లో ఎవరు గెలిచినా పెద్ద తేడా ఏమీ ఉండదని తెలిపారు. జాగృతి టార్గెట్ బీసీ రిజర్వేషన్లు సాధించటమే అని.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాదని స్పష్టం చేశారు. 8వ తేదీన కోర్టు తీర్పును బట్టి స్థానిక సంస్థల ఎన్నికలపై తమ స్టాండ్ చెప్తామన్నారు. పోటీ చేసే అంశంపై తమ నాయకులతో చర్చించి నిర్ణయిస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును రిపేర్ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం మంచిదే అని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ సీరియస్‌గా ఫైట్ చేయాలని కవిత సూచించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలను మార్చి గెజిట్ విడుదల చేసిందని ఆరోపించారు. అయితే, బతుకమ్మ నిమజ్జన కార్యక్రమంలో సీఎం పాల్గొనడాన్ని ఆమె స్వాగతించారు. ఈ సందర్భంగా, తనకు బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని కవిత స్పష్టం చేయడం గమనార్హం.



బుధవారం మీడియాతో మాట్లాడుతున్న కవిత

# కెసిఆర్‌కు రైతుకు ఉన్నది పేగు బంధం.. కాంగ్రెస్‌కున్నది కేవలం ఓటు బంధం

> అన్నదాతల ఆత్మహత్యలు రికార్డు స్థాయిలో తగ్గడం కెసిఆర్ నిర్విరామ కృషికి ఫలితం
>
> ఎక్స్ వేదికగా బిఆర్ఎస్ సీనియర్ నేత టి.హరీశ్‌రావు వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు1:** కేసీఆర్ పాలన గురించి నోరు పారేసుకునే వారికి జాతీయ నేర గణాంక విభాగం నివేదిక చెప్పుపెట్టు సమాధానమని సిద్దిపేట ఎమ్మెల్యే,బిఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు అన్నారు. 2014లో రైతు ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉన్న తెలంగాణ నేడు 14వ స్థానానికి పరిమితమైందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అన్నదాతల ఆత్మహత్యలు రికార్డు ఉస్థాయిలో 95.84 శాతం తగ్గాయని చెప్పారు. రైతును రాజును చేయాలన్న కేసీఆర్ సంకల్పానికి, చేసిన నిర్విరామ కృషికి వచ్చిన ఫలితమని చెప్పారు. కేసీఆర్‌కు రైతుకు ఉన్నది పేగు బంధం, ఆత్మ బంధం అయితే.. కాంగ్రెస్‌కు ఉన్నది కేవలం ఓటు బంధం మాత్రమేనని విమర్శించారు. 2014లో 1347 రైతు ఆత్మహత్యలు నమోదు కాగా, 2023 నాటికి 56కి తగ్గుదల. 2014లో రైతు ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉన్న తెలంగాణ నేడు 14 వ స్థానికి పరిమితం. 2023లో దేశ వ్యాప్తంగా 10,786 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా అందులో తెలంగాణ వాటా కేవలం 0.51శాతం. 10 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో అన్నదాతల ఆత్మహత్యలు రికార్డు స్థాయిలో 95.84 శాతం తగ్గుదల. ఇవి మాటలు కాదు, కేసీఆర్ తిరగరాసిన రికార్డులు, కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్న వాస్తవాలు. రైతును రాజు చేయాలన్న కేసీఆర్ సంకల్పానికి, వారు చేసిన నిర్విరామ కృషికి వచ్చిన ఫలితం ఇదంతా! అని చెప్పారు. స్వరాష్ట్రంలో ఒక్కో పథకంతో వ్యవసాయరంగానికి జీవం పోశారు. సాగును బాగు చేశారు. రుణమాఫీతో రైతన్నకు ధీమా దొరికింది. రైతు బంధు బంధువు అయ్యింది. రైతు బీమా కొండంత భరోసా ఇచ్చింది. 24 గంటల ఉచిత విద్యుత్తు వెలుగులు నింపింది. పంట కొనుగోళ్లతో ప్రోత్సాహం అందింది. కాళేశ్వరం ప్రాజెక్టుతో సాగునీటి గోస తీరింది. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ జరిగింది. భూగర్భ జలాలు ఉబికి బీడు భూములను పంట పొలాలుగా మార్చింది. ఉమ్మడి పాలనలో నిత్య దుర్భిక్షం, సాగు విధ్వంసం, వలసల దురవస్థ, ఆత్మహత్యల దౌర్భాగ్యం, తెలంగాణ. స్వరాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులతో సుజలమై, ధాన్యపురాశులతో సుఫలమై, సాగుభూమి సస్యశ్యామలమై.. కేసీఆర్ పాలనలో విరాజిల్లింది తెలంగాణ అని పేర్కొన్నారు.

తెలంగాణను అన్నంగిన్నెగా దేశానికే ఆదర్శంగా నిలిపింది కేసీఆర్. ఆత్మహత్యల తెలంగాణను, అన్నపూర్ణగా మార్చింది కేసీఆర్. కేసీఆర్ పాలన గురించి నోరు పారేసుకునే వారికి ఇది చెంపపెట్టు సమాధానం. కేసీఆర్ కు రైతుకు ఉన్నది పేగు బంధం, ఆత్మ బంధం అయితే.. కాంగ్రెస్ కు ఉన్నది కేవలం ఓటు బంధం అని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

# తెలంగాణలో మహిళలపై పెరిగిన నేరాలు

## ఎన్‌సిఆర్‌బి నివేదికలో వెలుగు చూసిన నిజాలు

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** భారత్‌లో మహిళలపై జరుగుతున్న నేరాలు ఎంతమాత్రం తగ్గడం లేదని నేషనల్ క్రైం రికార్డు బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) మరోమారు వెల్లడించింది. 2023కి సంబంధించి మహిళలపై దేశ వ్యాప్తంగా జరిగిన నేరాల వివరాలను ఎన్‌సిఆర్‌బి బుధవారం బహిర్గతం చేసింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో మహిళలపై జరిగే నేరాల సంఖ్య ఎక్కువగా వున్నట్లు అందులో వుంది. 2023లో నాలుగు లక్షల 48 వేల 211 కేసులు నమోదు కాగా లక్ష మంది మహిళలపై 66.2 శాతంగా నేరాల సంఖ్య వుందని ఎన్‌సిఆర్‌బి తెలిపింది. తెలంగాణ వరకు వ స్తే నేరాల సంఖ్య 124.9గా వుండగా దీని తరువాత రాజస్తాన్‌లో 114.8, ఒడిషా 112.4, హరియాణా 110.3, కేరళ 86.1 ఆ తరువాతి స్థానాల్లో వున్నాయి. అయితే మహిళలపై అత్యధిక సంఖ్యలో నేరాలు జరిగిన రాష్ట్రంగా యుపి నిలిచింది. ఈ రాష్ట్రంలో 66,381 కేసులు నమోదు కాగా ఆ తరువాత మహారాష్ట్రలో 47,101, రాజస్తాన్‌లో 45,450, బెంగాల్‌లో 34,691, మధ్యప్రదేశ్ లలో 32,342 వున్నాయి. తెలంగాణలో 23,679 కేసులు నమోదయ్యాయి.మహిళలపై జరిగే నేరాల్లో వరకట్న వేధింపులే ఎక్కువగా వున్నాయిజ ఈ తరహా కేసులో లక్షా 33,676గా వుండగా కిడ్నాప్ కేసులు 88,605గా వుంది. దాడులకు సంబంధించిన కేసులు 83,891 వుండగా, అత్యాచారంకేసులు 29,670గా వుంది. కాగా దేశ వ్యాప్తంగా లక్షా 85 వేల 961 కేసులు పెండింగ్‌లోవున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అంతకు ముందు వున్న పెండింగ్ కేసులతో పో లిస్తే వీటి సంఖ్య ఆరు లక్షల 35 వేల 159కి చేరింది. కాగా 2025 ఏడాదిలో మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించి ఆరు లక్షల 67వేల 940 మంది నిందితులను అరెస్టు చేయగా ఇందులో ఐదులక్షల 87 వేల 441 మంది పురుషులు, 80వేల 490 మంది మహిళలు, తొమ్మిది మంది ట్రాన్స్‌జెండర్లు వున్నారు.

### ఛార్జిషీట్ల దాఖలులో మొదటి స్థానంలో నిలిచిన తెలంగాణ

ఇదిలావుండగా మహిళలపై జరిగే నేరాల విషయంలో మొదటి స్థానంలో వున్న తెలంగాణ ఇదే సమయంలో ఈ కేసులకు సంబంధించి ఛార్జిషీట్ల దాఖలులో దేశంలో అగ్రభాగంలో నిలిచింది. 88. 1 కేసుల్లో ఛార్జిషీట్లు దాఖలు చేసిన తెలంగాణ జాతీయ సగటు 77.6ను అధికమించింది.

# రామగుండంలో యూరియా ఉత్పత్తి పునరుద్ధరణ

> 46 రోజుల పాటు నిలిచిన ఫ్యాక్టరీ

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)ను 46రోజుల విరామం తరువాత ఎట్టకేలకు ఉత్పత్తి ప్రారంభించింది. ప్లాంట్‌లో బుధవారం యూరియా ఉత్పత్తి జరగడం మొదలైంది. రోజుకు 3,850 టన్నుల సామర్థ్యం గల ఈ ప్లాంట్‌లో మొదట తక్కువ లోడ్‌తో ఉత్పత్తి చేయాలనే ఆలోచనతో యాజమాన్యం ఉన్నది. నెల రోజుల్లో యాసంగి సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రామగుండం యూరియా ఉత్పత్తిలోకి రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఊపిరి పీల్చుకుంది. యూరియా ఉత్పత్తి విషయమై రాష్ట్ర వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యంతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ వస్తున్నారు. కాగా అగస్టు 14న ఫ్యాక్టరీలోని హెచ్‌టీఆర్‌లో మెషీన్‌లో లీకేజీ కారణ:గా షట్‌డౌన్ అయింది. ప్లాంట్‌లో యూరియా ఉత్పత్తి ప్రక్రియలో భాగంగా సింధసిస్ గ్యాస్ ప్రొడ్యూస్ చేసేందుకు ఏర్పాటు చేసిన హీట్ ట్రాన్స్‌ఫార్మింగ్ (హెచ్‌టీఆర్)ను బైపాస్ చేసి ఉత్పత్తి చేస్తున్నారు. ప్లాంట్ రోజుకు 3,850టన్నుల సామర్థం కాగా హెచ్‌టీఆర్‌ను బైపాస్ చేయడంతో రోజుకు 3,500 టన్నుల నుంచి 3,600 టన్నులు ఉత్పత్తి చేశారు. హెచ్‌టీఆర్ పని చేయకపోవడంతో గ్యాస్ ఒత్తిడిలో హెచ్చు తగ్గులు వచ్చి అమ్మోనియా పైప్‌లైన్ లీకైంది. దీంతో ఆగస్టు 14న ఉత్పత్తి నిలిపివేశారు. ప్లాంట్‌ను పునరుద్ధరించే విషయంలో ఆర్ఎఫ్‌సీఎల్‌కు టెక్నాలజీ సరఫరా చేసిన డెన్మార్క్‌కు చెందిన హాల్దర్ టాప్స్ సంస్థ ఇంజనీర్ వచ్చే వరకు ప్లాంట్‌లో మరమ్మతులు సాధ్యం కాలేదు. ఎల్అండ్‌టీ నిపుణుల సహకారంతో మరమ్మతు పనులు చేశారు. 46రోజుల పాటు ఉత్పత్తి నిలిచిపోవడంతో ఆర్ఎఫ్‌సీఎల్‌కు 1.77లక్షల టన్నుల ఉత్పత్తి నష్టం జరిగింది. రూ.120కోట్ల వరకు ఆర్థిక నష్టం ఏర్పడింది. మరోపక్క కీలకమైన సమయంలో ప్లాంట్ ఉత్పత్తి నిలిచిపోవడంతో తెలంగాణలో తీవ్ర యూరియా కొరత ఏర్పడింది. వర్షాకాల సీజన్‌లో గతంలో ఆర్ఎఫ్‌సీఎల్ నుంచే సుమారు 2.5లక్షల టన్నుల యూరియా సరఫరా జరిగేది. ఈ సారి ప్లాంట్‌లో సాంకేతిక అవరోధాల మూలంగా యూరియా సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

# ఎల్ఐసితో ఒప్పందం కుదుర్చుకున్న ఆర్‌బిఎల్

**హైదరాబాద్,అక్టోబర్ 1,ప్రభాతవార్త :** దేశంలోనే అతి పెద్దదైనన లైఫ్ ఇన్స్యూరెన్స్ సంస్థ ఎల్ఐసి ఆర్‌బిఎల్ బ్యాంక్ ఇన్స్యూరెన్స్‌తో బుధవారం ఒప్పందం కుదుర్చుకుంది.భారతదేశం అంతటా ఆర్థిక రక్షణను విస్తరించడానికి మరియు బీమా వ్యాప్తిని బలోపేతం చేయడానికి రెండు సంస్థల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమైంది.ఈ రెండు సంస్థల మధ్య కుదిరిన ఈ ఒప్పందంతో ఆర్బీఎల్ బ్యాంకు కస్టమర్లు బ్యాంకు బ్రాంచ్‌లు, డిజిటల్ ఛానెళ్ల ద్వారా ఎలసీకి చెందిన అన్ని రకాల జీవిత బీమా పాలసీలను పొందడానికి వీలు కల్పిస్తుందని బ్యాంకు అధికారిక ప్రకటనలో తెలిపింది.ఈ భాగస్వా మ్యం ద్వారా ఆర్బీఎల్ బ్యాంక్ కస్టమర్లకు టర్మ్ ప్లాన్లు, ఎండోమెంట్ పాలసీలు, పెన్షన్, యూని ట్‌లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు అందుబాటులో ఉంటాయి. ఎల్బ్బీకి 3,600 కంటే ఎక్కువ బ్రాంచ్లు, కార్యాలయాలకు తోడు ఆర్‌బిఎల్ బ్యాంక్ 2,000 కంటే ఎక్కువ టచ్‌ పాయింట్లు టచ్పాయింట్ల నెట్‌వర్క్‌బలం దేశవ్యాప్తంగా జీవిత బీమా విస్తరణ సులభతరంఅవుతుంది. 2047 నాటికి అందరికీ బీమాఅనేలక్ష్యాన్ని చేరుకునేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని బ్యాంకు పేర్కొంది.



# విజయ దశమి శుభాకాంక్షలు తెలిపిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

## మంత్రులు పొంగులేటి, తుమ్మల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధిహైదరాబాద్,అక్టోబరు1:** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు విజయదశమి సంతోషంగా జరుపుకోవాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేసి ప్రజల మన్ననలు పొందామని అన్నారు. దసరా పర్వదినం ధర్మం చెడుపై విజయం సాధించిన శుభసందేశం అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ విజయదశమి సందర్భంగా మీ కుటుంబాల్లో సుఖశాంతులు, ఐశ్వర్యం, ఆరోగ్యం నిండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఇంటిలో ఆనందం అలముకోవాలని, ప్రతి మనసులో సంతోషం విరజిమ్మాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. తెలుగు ప్రజలు అందరికీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా చేసుకునే ఈ దసరా పండుగను తెలుగు ప్రజలందరూ ఘనంగా జరుపుకోవాలని, ప్రజలందరికీ విజయం, ఐశ్వర్యం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

## శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 1 ప్రభాతవార్త:** హిందూ బంధువులందరికీ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడు మీద మంచి సాధించిన విజయానికి చిహ్నంగా, దేశవ్యాప్తంగా ఆనందోత్సాహాల మధ్య దసరా పండుగను వైభవోపేతంగా నిర్వహించుకోవడం మన సంప్రదాయం అన్నారు. దసరా పండగ మనలో కొత్త ఉత్సాహాన్ని నింపడంతోపాటుగా మనకు బాధ్యతలను కూడా గుర్తుచేస్తుందని, రామాయణ మూలసూత్రాలను, అందులో దాగున్న విలువలను సమాజానికి బోధించే దసరా పండగ అన్నారు. ప్రపంచం, సమాజం, కుటుంబం వంటి విషయాల్లో మన కర్తవ్యాన్ని, మనుషుల మధ్య పరస్పర సంబంధాలు, మర్యాదలను గుర్తుచేస్తుందని, దీనికితోడు దసరా పండగ ప్రపంచానికి స్త్రీ శక్తిని చాటుతుందన్నారు. మహిళలు దుర్గాదేవి అవతారం, వారిని గౌరవించుకోవడంతోపాటు సమాజంలో వారికి సమాన అవకాశాలు ఇవ్వాలన్న స్ఫూర్తిని చాటే పండగ దసరా అన్నారు. ఈ పండగ మీ అందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని హృదయపూర్వకంగా ఆకాంక్షి స్తున్నానని కేంద్ర మంత్రి తెలిపారు.

## మంత్రులు జూపల్లి, సీతక్క శుభాకాంక్షలు

**హైదరాబాద్,అక్టోబరు 1,ప్రభాతవార్త:** పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. ప్రజలందరికీ విజయదశమి, దసరా శుభాకాంక్షలు తెలిపారు. భక్తులు విశేష భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ శరన్నవరాత్రులు ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక వేడుకగా చెప్పుకోవచ్చు. ఊరు,వాడలంతా అమ్మవారి సంబరాలతో భక్తి భావం ఉట్టిపడుతోంది.ముఖ్యంగా బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. ప్రజా సంక్షేమ పాలన ప్రగతే ధ్యేయంగా (శ్రమిస్తున్న) ప్రజా ప్రభుత్వానికి ప్రజలు మద్దతు,దుర్గమ్మ ఆశీస్సులు లభించాలని కోరుకుంటున్నాన్నారు.విజయదశమి పర్వదిన సందర్భంగా రాష్ట్ర ప్రజలకు పంచాయితీరాజ్ (గ్రామీణాభివృద్ధి), మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క శుభాకాంక్షలు తెలిపారు.దసరా పండుగ చెడుపై మంచికి,అజ్ఞానంపై జ్ఞానానికి,అన్యాయంపై న్యాయానికి సంకేతంగా నిలుస్తుందన్నారు. ఈ పర్వదినం ప్రతిఇంట్లో సుఖశాంతులు నింపి, ప్రజల జీవితాల్లో మరింత ఆనందం, అభివృద్ధి, ఐక్యతను ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## దసరా ఆనందం, సంతోషం నింపాలి

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 1 ప్రభాతవార్త:** విజయదశమి పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, సంతోషం నింపాలని, సమాజంలో సౌభ్రాతృత్వం పెంపొందించాలని కోరుకుంటున్నానని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. పండగ సందర్భంగా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అధర్మంపై ధర్మం గెలిచిన రోజుగా దసరా ప్రత్యేకతను కలిగి ఉందని, ప్రజలందరికీ సుఖ సంతోషాలు, అభివృద్ధి, ఆరోగ్యం కలగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షి స్తున్నానని అన్నారు.

### ఎన్‌టిఎఫ్‌టీమ్ తనిఖీల్లో

## పట్టుబడిన 67 మద్యం బాటిళ్లు

**హైదరాబాద్,అక్టోబర్ 1,ప్రభాతవార్త:** ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ టీములు బుధవారం శంషాబాద్ ఏరియాలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 67 నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ఏరియాలో..ఏ అండ్ ఎ ఎస్ టి ఎఫ్ టీం కు సంబంధించి అంజిరెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు ఒకవైపు.. మరోవైపు బి అండ్ డి ఎస్ టి ఎఫ్ టీములు సిఐలు భిక్షా రెడ్డి, నాగరాజు టీములు శంషాబాద్ ఏరియాలో వాహనాలు తనిఖీలు చేపట్టి గోవా హర్యానా ఢిల్లీ ప్రాంతాల నుంచి తీసుకు వస్తున్నటువంటి 67 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు.పట్టుకున్న మద్యం బాటిల్లను శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు.

**ఎక్సైజ్ కార్యాలయంలో ఘనంగా పూర్తయిన దేవి నవరాత్రులు:** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలోని శ్రీలలితా త్రిపుర సుందరి దేవాలయంలో తొమ్మిది రోజులపాటు శరత్ నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరిగాయి.చివరి రోజు దేవాలయ ప్రాంగణంలో గణపతి హోమం పూర్ణాహుతి నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు అనంతరం కార్యాలయంలోని అందరికి అమ్మవారి ప్రసాదంతో పాటు భోజనాలను ఏర్పాటు చేశారు.



# బిసి హక్కుల సాధన కోసం అందరు ఏకం కావాలి

## కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు

**హైదరాబాద్, అక్టోబరు 1 ప్రభాతవార్త:** బిసి హక్కులు కోసం అంత ఒక్కటి కావాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు రాకముందే 4500 కిలోమీటర్లు రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారన్నారు. దేశంలో గల బడుగు బలహీన వర్గాలు కోసం తెలుసు కున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుల, జనగణన చేసి బిసిలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. కామారెడ్డి బహిరంగ సభలో 42శాతం బిసిలకు రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర మంత్రి పొన్నం, టిపిసిసి మహేష్ కుమార్ గౌడ్ బిసిలకు ప్రత్యేక కార్యాచరణతో వెళ్తున్నారని, అసెంబ్లీలో బిజెపి, బిఆర్ఎస్ మద్దతు తెలుపుతున్నాయని, బయట ధర్నాలు చేస్తున్నాయన్నారు. అక్టోబర్ 8న హైకోర్టులో విచారణ ఉన్న నేపథ్యంలో అందరూ బయటకు రావాలని పిలుపునిచ్చారు. గతంలో ఇచ్చిన 27శాతమే అమలు అవ్వడంలేదని, 42శాతం కోసం బిసిలు బయటకు రాకపోతే భవిష్యత్తులో ఇలాంటి అవకాశాలు మళ్లీమళ్లీ రావని అన్నారు. స్థానిక ఎన్నికలు, విద్య, ఉద్యోగం అన్ని అంశాలలో బిసిలకు రిజర్వేషన్లు అమలు కావాలన్నారు.

# వికలాంగుల ఆత్మ బంధువు సిఎం రేవంత్‌కు ప్రత్యేక ధన్యవాదాలు

## వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య

**హైదరాబాద్, అక్టోబరు 1 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజాపరిపాలన కొనసాగుతుందని వికలాంగుల కార్పోరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా జీతాలు పెరగడంపై హర్షం వ్యక్తం చేశారు. వేతలనాలు పెంపుపై సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. వికలాంగుల కార్పొరేషన్‌లో ఉద్యోగులకి 2010, 2015, 2020 పిఆర్‌సితో కూడిన జీతం ఇవ్వడం జరిగిందన్నారు. ఒక్కో వికలాంగ ఉద్యోగికి సగటున అదనంగా 60000 నుండి 80000 వేలకి పైగా జీతం పెరిగిందన్నారు. ఈ పిఆర్‌సిల కోసం గత 10 సంవత్సరాలుగా విశ్వ ప్రయత్నాలు చేసిన వాళ్లకి నిరాశే మిగిలింది, గత కెసిఆర్ ప్రభుత్వం విస్మరించినదని, కానీ సిఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన ప్రభుత్వం గుర్తించిందన్నారు. తాను కార్పొరేషన్ చైర్మన్ అయినా తర్వాత మెదటి బోర్డు సమావేశంలోనే 2010, 2015, 2020 పిఆర్‌సిలు వర్తింపజేయాలి అని తీర్మానం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఈ 3పిఆర్‌సిల ఫైలు వెళ్ళగానే వెంటనే ఆమోదించడంతో పాటు పెరిగిన జీతం ఉద్యోగులకి అందేలా చేశారన్నారు.

## టిజి సెట్ 2025 నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్,అక్టోబర్ 1,ప్రభాతవార్త :** రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టుల కోసం తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ 2025(టిజి సెట్ 2025)కు ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదలైంది.టిజి సెట్ 2025 పరీక్ష డిసెంబర్ 2025 రెండో వారంలో జగనున్నాయి. ఈ పరీక్ష కంప్యూటర్ బేస్ టెస్ట్ (సిబిటి) విధానంలో నిర్వహించనున్నారు. పరీక్ష రెండు పేపర్లుగా ఉండనుంది. పేపర్ 1లో 50 ప్రశ్నలు, పేపర్2లో 100 ప్రశ్నలు ఉంటాయి. మొత్తం మార్కులు 300లకు గాను ప్రతి పేపర్ కోసం 3 గంటల సమయం ఇవ్వనున్నారు. అయితే, పేపర్1, పేపర్2లో అభ్యర్థులు ఉత్తీర్ణులు అయితే.. అసిస్టెంట్, లెక్చరర్ పోస్టులకు అర్హులు అవుతారు. టిజి సెట్ 2025 కోసం అభ్యర్థులకు ఆన్లైన్ అప్లికేషన్ ఫామ్స్ అక్టోబర్ 10 నుంచి అందుబాటులో ఉంటాయి. పరీక్షలకు దరఖాస్తు చేసేందుకు అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూ, డబ్ల్యూ.డబ్ల్యూ. తెలంగాణసెట్.ఓర్జి ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

# ఖరీఫ్ 1.33 కోట్ల ఎకరాల్లో సాగు

## 100 శాతం పూర్తయిన పంటలు

**హైదరాబాద్,అక్టోబరు 1,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సీజనులో పంటల సాగు 100 శాతం పూర్తయింది. రాష్ట్రంలో సాధారణ సాగు విస్తీర్ణం 1,32,44,305 ఎకరాలు కాగా, ఇప్పటివరకు 1,33,09,765 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. గత ఏడాది ఖరీఫ్‌లో 1,28,67,494 ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలు సాగుచేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. దీంతో పోలిస్తే ఈ ఖరీఫ్‌లో 4,42,271 ఎకరాల్లో పంటల సాగు పెరిగింది. వ్యవసాయశాఖ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో వీటి వివరాలను వెల్లడించింది. ప్రధాన పంటలైన వరి 107.72 శాతం మేర 67,30,08 ఎకరాల్లోను, పత్తి 93.90 శాతం చొప్పున 45,94,685 ఎకరాల్లో సాగు చేశారు. ఇక మొక్కజొన్న 6,44,652 ఎకరాల్లో, సోయాబీన్ 3,62,120 ఎకరాల్లో వేశారు. మిగిలిన విస్తీర్ణంలో పప్పు ధాన్యాలు, నూనె గింజలు, ఇతర పంటలు సాగుచేశారు. ఇక ఖరీఫ్ కొనుగోళ్ల సీజన్ బుధవారం నుంచి ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం ధాన్యం సేకరణ కూడా దేశవ్యాప్తంగా అక్టోబరు నుంచే శ్రీకారం చుడుతుంది. ధాన్యం సేకరించే ఎఫ్‌సీఐ అయినా, పత్తి కొనుగోళ్లు చేసే సీసీఐ అయినా రాష్ట్రంలో వరి, పత్తి కాకుండా మొక్కజొన్న, జొన్న, సోయాబీన్ లాంటి ఇతర పంటలను కొనుగోలుచేసే మార్క్‌ఫెడ్ కూడా అక్టోబరు నుంచి ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ప్రారంభిస్తాయి. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ప్రారంభం అవుతున్నా పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామనే విషయాన్ని సీసీఐ వెల్లడించలేదు. జాబ్ వర్క్ కోసం సీసీఐ పిలిచిన టెండర్లలో కూడా జిన్నింగ్, ప్రెస్సింగ్ మిల్లర్లు పాల్గొనలేదు.

## సినీ హీరో నాగార్జున హక్కులకు రక్షణ

### ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** టాలీవుడ్ సీనియర్ హీరో అక్కినేని నాగార్జున పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. హీరో నాగార్జున వ్యక్తిగత హక్కులకు రక్షణ కల్పిస్తున్నట్లు ఆ ఆదేశాల్లో వెల్లడించింది. అంతేకాకుండా నాగార్జున అనుమతి లేకుండా వారి పేరును వాడుకోవద్దని ఆదేశించింది.కాగా సోషల్ మీడియా, ఇతర వేదికలపై తనకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతూ, తన పరువు, ప్రతిష్టలు, హక్కులకు భంగం వాటిల్లేలా వ్యవహరిస్తున్నారని, తన హక్కులకు రక్షణ కల్పించాలని నాగార్జున ఇటీవల ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కొంతమంది తన ఫొటో, పేరును వాడుకుంటున్నారని, తన అనుమతిలేకుండా తన పేరుగాని, ఫొటోలు గాని వాడకుండా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే ఏఐ ఆధారంగా వీడియోలు, కంటెంట్ రూపొందించడం, అనధికారిక వాణిజ్య ప్రకటనల్లో ఉపయోగించడం జరుగుతుందని తన పిటిషన్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ పిటిషన్ పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు బుధవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.కాగా ఇటీవలి సందర్భాలలో బాలీవుడ్ నటులు ఐశ్వర్య రాయ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్లకు కూడా ఢిల్లీ కోర్టు ఇలాంటి తీర్పే ఇచ్చింది.

## నేడు కొండారెడ్డి పల్లిలో సిఎం దసరా వేడుకలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు1:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లికి నేడు వెళ్లనున్నారు. దసరా పండుగ సందర్భంగా ఆయన సొంత నియోజకవర్గం కొండగల్‌లో పర్యటించనున్నారు. గురువారం ఉదయం మహాత్మగాంధీ జయంతి సందర్భంగా నగరంలోని బాపూ ఘాట్‌లో ముందుగా సిఎం రేవంత్ నివాళులర్పిస్తారు. అనంతరం కొండారెడ్డి పల్లికి బయలుదేరి అక్కడ గ్రామస్థులతో కలిసి దసరా పండుగను జరుపుకుంటారు. గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కొడంగల్‌కు ఆయన చేరుకుంటారు. అక్కడ కార్యకర్తలు, ముఖ్య నాయకులతో ముచ్చటించి రాత్రి అక్కడే బసచేస్తారు. శుక్రవారం ఉదయం తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు. ఈ పర్యటనలో భాగంగా సిఎం రేవంత్ రెడ్డి నియోజవకర్గ ప్రజలు, కేడర్‌తో మమేకం కానున్నారు. స్థానిక సంస్థల వేళ వ్యవహారించాల్సిన తీరుపై సిఎం కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకత్వానికి దిశానిర్దేశం చేసే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది.

# గిరిజన సంక్షేమ శాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపులకు రూ.83.07 కోట్ల నిధుల విడుదల

## సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్,అక్టోబర్ 1,ప్రభాతవార్త:** గిరిజన సంక్షేమ శాఖలో నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులకు ఎట్టకేలకు ఊరట లభించింది. మొత్తం రూ.83.07 కోట్ల నిధులను బుధవారం ప్రభుత్వం విడుదల చేసింది. దీని వల్ల పాఠశాలలు, హాస్టళ్లలో ఇరుక్కున్న వేతనాలు,బిల్లులు బుధవారం క్లియర్ అయ్యాయి.ఈ నిధుల విడుదలకు సంబంధించి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి విన్నవించగా, వెంటనే స్పందించి నిధులు విడుదల చేశారనిమంత్రి తెలిపారు.నిధుల మంజూరు పట్ల సిఎం రేవంత్ రెడ్డి,ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.పెండింగ్ బిల్లుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సిబ్బందికి ఇది భారీ ఉపశమనమన్నారు.విద్యార్థుల భోజన సరఫరా, సిబ్బంది వేతనాలు,విద్యా కార్యకలాపాల సాఫీగా సాగేందుకు ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గిరిజన విద్య, సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న కట్టుబాటుకు ఈ నిధుల విడుదల మరో నిదర్శనమన్నారు.ఈ నిధుల్లో డైట్ బిల్లులకు రూ.55.19 కోట్లు, హాస్టల్ కార్మికులు వేతనాలకు రూ.9.44 కోట్లు, ఆశ్రమ పాఠశాలలలు, హాస్టళ్ళలో దినసరి వేతన సిబ్బందికి రూ.8.84 కోట్లును కేటాయించనున్నట్లు తెలిపారు.

# రెపోరేట్లు యధాతథం..

## 5.5శాతం వద్దనే కొనసాగించిన ఆర్బీఐ




**ముంబయి, అక్టోబరు 1:** రుణ గ్రహీతలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ద్రవ్య విధాన పరపతి సమీక్షలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటును ప్రస్తుతం ఉన్న 5.5 శాతంగానే యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారంఎంపిసి నిర్ణయాలను వెల్లడించారు. దీంతో ఇప్పట్లో గృహ, వాహన, ఇతర రుణాలపై వడ్డీ రేట్లు (ఈఎంఐలు) తగ్గే అవకాశం కనిపించడం లేదు. ద్రవ్య విధానంపై తటస్థ వైఖరినే కొనసాగించాలని కమిటీ నిర్ణయించినట్లు సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడం, అదే సమయంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం మధ్య సమతుల్యత సాధించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గతంలో తీసుకున్న విధానపరమైన నిర్ణయాల పూర్తి ప్రభావం స్పష్టంగా కనిపించే వరకు వేచి చూడటం సమంజసమని భావిస్తున్నామని ఆయన వివరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటికే 100 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించామని, ఆ ప్రయోజనాలు ఇంకా ఆర్థిక వ్యవస్థకు పూర్తిగా అందాల్సి ఉందని ఆయన గుర్తుచేశారు. మరోవైపు, దేశ ఆర్థిక భవిష్యత్తుపై ఆర్బీఐ సానుకూల అంచనాలను ప్రకటించింది. ఆహార పదార్థాల ధరలు గణనీయంగా తగ్గడం, జీఎస్టీ రేట్ల కోత వంటి కారణాలతో ద్రవ్యోల్బణం మరింత అదుపులోకి వచ్చిందని గవర్నర్ తెలిపారు.

ఈ నేపథ్యంలో, 202526 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం సగటు అంచనాను గతంలోని 3.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా, దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు అంచనాను కూడా ఆర్బీఐ పెంచింది. దేశీయంగా బలమైన గిరాకీ, అనుకూలమైన రుతుపవనాలు, ద్రవ్య విధాన సరళీకరణ వంటి అంశాల నేపథ్యంలో వృద్ధి అంచనాను 6.5 శాతం నుంచి 6.8 శాతానికి పెంచుతున్నట్లు సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ప్రస్తుతం వాణిజ్యపరమైన అంశాలలో చోటుచేసుకుంటున్న పరిణామాలను కూడా నిశితంగా గమనిస్తున్నామని, అందుకే వడ్డీ రేట్ల విషయంలో వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నామని ఆయన తెలిపారు.

మరోవైపు చిన్న మొత్తాలపై వడ్డీరేటును మరోసారి యథాతథంగా ఉంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అక్టోబర్ 1 నుంచి మూడు నెలల పాటు ప్రస్తుతం ఉన్న వడ్డీరేట్లు కొనసాగనున్నాయని తెలిపింది. దీంతో చిన్న మొత్తాలపై వడ్డీరేట్లను ముట్టుకోకపోవడం ఇది ఏడోసారి కావడం విశేషం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు) చిన్న మొత్తాలపై వడ్డీరేట్లలో ఎలాంటి మార్పులు చేయడం లేదని ఆర్థిక మంత్రిత్వశాఖ తన నోటిఫికేషన్‌లో వెల్లడించింది. దీంతో సుకన్య సమృద్ధి పథకం కింద వడ్డీరేటు 8.2 శాతంగాను, అలాగే పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్(పీపీఎఫ్)పై 7.1 శాతం, పోస్టాఫీస్ పొదుపు డిపాజిట్ స్కీంపై 4 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది.

# రూ.15.50 పెరిగిన వాణిజ్య సిలిండర్‌ధర..




**ముంబయి, అక్టోబరు 1:** గ్యాస్ ధరలు వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. పండుగ వేళ గ్యాస్ భారం స్వల్పంగా పెరిగింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరలను పెంచినట్లు చమురు మార్కెటింగ్ కంపెనీలు తాజాగా ప్రకటించాయి. 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధరను రూ.15.50 మేరకు పెంచినట్టు ప్రకటించాయి. దాంతో వాణిజ్య సిలిండర్ ధర రూ.1595.50కి పెరిగింది. కీలక పండుగలకు ముందు వాణిజ్య సిలిండర్ గ్యాస్‌పై ఎక్కువగా ఆధారపడే హోటల్స్, రెస్టారెంట్లతో పాటు పలు రంగాలను ప్రభావితం చేయనున్నది. సవరించిన రేట్ల ప్రకారం 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.15.50 పెరగ్గా ఢిల్లీలో, 19 కిలోల వాణిజ్య సిలిండర్ రూ.1,595.50 పెరిగింది. దేశ ఆర్థిక రాజధాని ముంబయి మహానగరంలో రూ.1,547, చెన్నైలో రూ.1,754, కోల్‌కతాలో రూ.1,700కి పెరిగింది. ఇక 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులు లేదు. దాంతో గృహ గ్యాస్ వినియోగదారులకు ఊరట లభించినట్లయ్యింది. ప్రస్తుతం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర ముంబయిలో రూ.852.50, ఢిల్లీలో రూ.853, చెన్నైలో రూ.868.50, కోల్‌కతాలో రూ.879, హైదరాబాద్‌లో రూ.925గా ఉన్నది. వాస్తవానికి వాణిజ్య అవసరాల కోసం వినియోగించే సిలిండర్‌ల ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రతి నెలా ఒకటో తేదీన మార్పులు చేస్తుంటాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ, ప్రభుత్వ విధానాలు, పన్ను విధానంలో మార్పులు, డిమాండ్ సరఫరాల్లో సీజనల్ మార్పులు, భౌగోళిక రాజకీయ అంశాలు, ఆయిల్ కంపెనీలు ఖర్చులు ఆదాయం తదితర అంశాల ఆధారంగా సిలిండర్ ధరల్లో మార్పులు చేస్తూ వస్తాయి. డొమెస్టిక్ గ్యాస్ ధరలను ప్రభుత్వం నియంత్రిస్తుండడంతో జనాలకు ఊరట కలుగుతున్నది. అయితే, వాణిజ్య సిలిండర్ల ధరలను మాత్రం ప్రతినెలా మారుతుంటాయి. తాజాగా మరోసారి ధరలు పెరగడంతో హోటల్స్, క్యాటరింగ్ సేవలు తదితర వాణిజ్య సంస్థలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందని భావిస్తున్నారు. ఇవన్నీ రోజువారీ కార్యకలాపాల కోసం ఎల్పీజీపైనే ఆధారపడుతుంటాయి. సిలిండర్ ధర పెరగడంతో ఈ వ్యాపారాల నిర్వహణ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ఖర్చులను వినియోగదారుల నుంచి రాబట్టేందుకు ధరలను పెంచే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# పర్సనల్, గోల్డ్‌లోన్‌లపై ఆర్బీఐ కొత్త రూల్స్..

## నిధుల సమీకరణలోనూ పలు మార్పులు

**ముంబయి, అక్టోబరు 1:** వ్యక్తిగత రుణాలు, బంగారు పూచీకత్తు, మూలధన సేకరణ వంటి విషయాల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పలు కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ఏడు కొత్త నిబంధనలతో సర్క్యులర్ ను విడుదల చేసింది. ఈ మార్పులలో మూడు అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వచ్చాయి. మిగిలిన నాలుగింటిపై ప్రజాభిప్రాయాన్ని కోరింది. ఈ క్రమంలో అక్టోబరు 1 (బుధవారం) అమల్లోకి వచ్చిన ఆర్‌బీఐ కొత్త నిబంధనలు ఇలా ఉన్నాయి. ఫ్లోటింగ్ రేట్ రుణాల విషయంలో కొన్ని ముఖ్యమైన మార్పులు జరగనున్నాయి. ఇప్పుడు మీరు ఫ్లోటింగ్ రేటు రుణం తీసుకుంటుంటే బ్యాంకులు మూడు సంవత్సరాల లాక్ ఇన్ వ్యవధికి ముందే మీ ఈఎంఐని తగ్గించొచ్చు. ఇది లోన్ తీసుకునేవారికి ప్రత్యక్షంగా మేలు చేస్తుంది. ఈఎంఐ తగ్గే అవకాశం ఉంది. అదనంగా స్థిర రేటు రుణాలపై ఉన్నవారికి ఫ్లోటింగ్ రేటుకు మారే అవకాశం ఇవ్వొచ్చు. ఇది తప్పనిసరి కాకపోయినా, బ్యాంకులు కోరుకుంటే ఈ ఆప్షన్ ను వినియోగదారులకు ఇవ్వొచ్చు. ఇది రుణగ్రహీతలకు సరైన వడ్డీ రేటును ఎంచుకోవడాన్ని సులభతరం చేస్తుంది. ఈ రూల్ అక్టోబర్ 1నుంచే అమల్లోకి వచ్చింది. బంగారం, వెండిలోన్ల విషయంలోనూ ఆర్‌బీఐ మార్పులు చేసింది. ఇప్పుడు ఆభరణాల వ్యాపారులు మాత్రమే కాకుండా బంగారాన్ని ముడి పదార్థంగా ఉపయోగించే చిన్న వ్యాపారాలు, చేతివృత్తులవారు వంటి ఎవరైనా కూడా బ్యాంకుల నుంచి బంగారం, వెండిపై లోన్ తీసుకోవచ్చు. బ్యాంకులు, టైర్3, టైర్4 పట్టణ సహకార బ్యాంకులు వారికి వర్కింగ్ క్యాపిటల్ రుణాలను అందిస్తాయి. ఈ నిర్ణయం చిన్న వ్యాపారాలకు మూలధనాన్ని సేకరించడానికి ఉపయోగపడుతుంది. అయితే, పెట్టుబడి లేదా ఊహాజనిత ప్రయోజనాల కోసం బంగారాన్ని కలిగి ఉన్న వ్యక్తులకు ఈ సౌకర్యం అందుబాటులో ఉండదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఈ నిబంధన కూడా బుధవారమే అమల్లోకి వచ్చేసింది. బేసెల్-3 మూలధన నిబంధనలను కూడా ఆర్‌బీఐ సవరించింది. దీని కింద విదేశాలలో జారీ చేసిన శాశ్వత రుణ అర్హత పరిమితిని పెంచింది. ఇది బ్యాంకులకు విదేశీ మార్కెట్ నుంచి టైర్1 మూలధనాన్ని సేకరించడంలో ఎక్కువ సౌలభ్యాన్ని అందిస్తుంది. ఆర్‌బీఐ గోల్డ్ మెటల్ లోన్ల(జీఎంఎల్) విషయంలో మార్పులుచేసింది. బంగారు ఆభరణాల ఎగుమతిదారులకు వర్కింగ్ క్యాపిటల్ ఫైనాన్స్ ను సులభతరం చేస్తుంది. ఈ పథకాన్ని మరింత సరళీకరించడానికి, ఆభరణాల పరిశ్రమలోని అర్హత కలిగిన రుణగ్రహీతలను గుర్తించడానికి ఉపయోగపడుతుంది. ఆర్‌బీఐ గోల్డ్ మెటల్‌లోన్ల తిరిగి చెల్లించే వ్యవధిని 180 రోజుల నుంచి 270 రోజులకు పెంచాలని ప్రతిపాదన చేసింది. ప్రస్తుత మార్గదర్శకాలు ఆభరణాల ఎగుమతిదారులు, దేశీయ ఆభరణాల తయారీదారులకు జీఎంఎల్ పొడిగింపును అనుమతిస్తాయి. భారతదేశంలో పనిచేస్తున్న విదేశీ బ్యాంకు శాఖల నిబంధనలకు కూడా ఆర్‌బీఐ కీలక మార్పులకు చేసింది. కొత్త నియమాలు ఇప్పుడు వాటి పెద్ద రుణ ఎక్స్‌పోజర్‌లు, ఇంటర్ గ్రూప్ లావాదేవీలకు వర్తిస్తాయని సర్క్యులర్‌లో పేర్కొంది. అలాగే క్రెడిట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టింగ్ లో కూడా మార్పులను ఆర్‌బీఐ ప్రతిపాదించింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు క్రెడిట్ బ్యూరోలకు డేటాను పదిహేను రోజులకు ఒకసారి (ప్రతి రెండు వారాలకు) సమర్పించడాన్ని తప్పనిసరి చేసింది. వేగంగా క్రెడిట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టింగ్ ఇవ్వడం వల్ల వ్యక్తుల క్రెడిట్ నివేదికలలో లోపాలను తగ్గించే అవకాశం ఉంది. అలాగే క్రెడిట్ నివేదికలోని లోపాలను సకాలంలో సరిదిద్దడానికి ఉపయోగపడుతుంది. ఇంకా గుర్తింపు ప్రక్రియను సులభతరం చేస్తూ, సీకేవైసీ నంబర్ ను ఇప్పుడు క్రెడిట్ నివేదికలో చేర్చాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది.

# ఆటోమొబైల్ సేల్స్ పతనం..

## గత యేడాదితో పోలిస్తే 13% తక్కువే

**ముంబయి, అక్టోబరు 1:** రిటైల్ ఆటోమొబైల్ సేల్స్ సెప్టెంబర్‌లో దాదాపు 13శాతం పడిపోయాయి. పండుగ సీజన్‌కు ముందు నెలాఖరు నాటికి డిమాండ్ మొదలైంది. దాంతో ఆటో కంపెనీలకు ఊరట కలగడంతో పాటు అక్టోబర్‌పై ఆశలను రేకెత్తించింది. వాహన్ పోర్టల్ డేటా ప్రకారం మొత్తం 1.51 మిలియన్ వాహనాలు నమోదయ్యాయి. గత సంవత్సరం ఇదే సమయంలో 1.74 మిలియన్ యూనిట్లతో పోలిస్తే ఇది 13.28 శాతం తగ్గింది. ఈ గణాంకాలు రిజిస్ట్రేషన్స్ మాత్రమే ప్రతిబింబిస్తాయని, పూర్తి డెలివరీల వివరాలు కొద్దిరోజుల తర్వాత మాత్రమే తెలుస్తుందని ఆటో పరిశ్రమ నిపుణులు తెలిపారు. సెప్టెంబర్ తొలి మూడువారాల్లో కొనుగోళ్లు మందగించాయి. పండుగ ఆఫర్లు, జీఎస్టీ రేట్లలో మార్పుల్లో స్పష్టత కోసం కొనుగోలుదారులు వాహనాలను కొనుగోలు చేయకుండా నిరీక్షించినట్లుగా పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అదే సమయంలో పితృప క్షాలు సైతం షాపింగ్‌ను ప్రభావితం చేసిందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 22న నవరాత్రుల ప్రారంభం నుంచే మార్కెట్‌లో సందడి కనిపించిందని జీఎస్టీ సంస్కరణలతో ధరలు సైతం తగ్గడంతో షోరూమ్స్ సందడిగా కనిపించినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా ప్యాసింజర్ కార్లు, ద్విచక్ర వాహనాల విభాగాల షోరూమ్‌ల్లో కస్టమర్ల రద్దీ, బుకింగ్‌లు, ఎక్వైరీలు పెరిగాయి.

దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి సెప్టెంబర్ 22 నుంచి 25 మధ్య కేవలం నాలుగు రోజుల్లో 75వేల వాహనాలను విక్రయించింది. మారుతి ఆగస్టు నెల మొత్తంలో సుమారు 1.35లక్షల యూనిట్లను విక్రయించింది. గత సంవత్సరం అక్టోబర్‌లో నవరాత్రి వేడుకలు ప్రారంభం కాగా.. పండుగల ప్రభావం సెప్టెంబర్‌లో కనిపించలేదు. ఈ సంవత్సరం సెప్టెంబర్ చివరి వారంలో డిమాండ్ కనిపించింది. ఇక రాబోయే నెలల్లో అమ్మకాలు జోరుగా సాగుతాయని ఆటోమొబైల్ ఇండస్ట్రీ భావిస్తున్నది. అక్టోబర్‌లో పండుగలు కొనసాగనున్నాయి. ఆ తర్వాత పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమవుతుంది. పెట్రోల్ కార్లపై 1200సీసీ వరకు, డీజిల్ కార్లపై 1500 సీసీ వరకు 18శాతానికి జీఎస్టీ తగ్గింది. అంతకంటే ఎక్కువ సీసీ కలిగిన వాహనాలపై 40శాతం.. ఇక ఎలక్ట్రికల్ వాహనాలపై కేవలం 5శాతం జీఎస్టీ పరిమితం చేయడంతో పరిశ్రమకు ఊతమిస్తుందని ఆటో ఇండస్ట్రీ భావిస్తున్నది.

# 80వేలమందికి ఉద్వాసన సోషల్‌మీడియా సృష్టే..

## టిసిఎస్ అధికార ప్రతినిధి వెల్లడి




**న్యూఢిల్లీ, అక్టోబరు 1:** ప్రముఖ ఐటీ దిగ్గజంటిసిఎస్ లో భారీ సంఖ్యలో ఉద్యోగాల తొలగింపు జరిగిందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు కలవరం కలిగించాయి. అయితే అదేమీ లేదని టిసిఎస్ స్పష్టంచేసింది. సుమా రు 80 వేల మంది ఉద్యోగులను కంపెనీ తొలగించిందని ప్రచారం జరుగుతుండగా, ఈ వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని టీసీఎస్ అధికారికంగా స్పష్టం చేసింది. సోహమ్ సర్కార్ అనే ఒక ఎక్స్ యూజర్ చేసిన పోస్ట్ ఈ చర్చకు దారితీసింది. టీసీఎస్ లో 15 ఏళ్లుగా పనిచేస్తున్న తన స్నేహితుడిని ఉటంకిస్తూ దాదాపు 80 వేల మంది ఉద్యోగులను రాజీనామా చేయమని కోరినట్లు ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. వీరిలో కొందరికి 18 నెలల జీతాన్ని పరిహారంగా ఇవ్వగా, మరికొందరికి కేవలం మూడు నెలల జీతంతో సరిపెట్టారని, ఇంకొందరికి ఎలాంటి పరిహారం అందలేదని ఆరోపించారు. ఈ పోస్ట్ వైరల్ కావడంతో, పలువురు నెటిజన్లు కూడా తమకు తెలిసిన వారిని కంపెనీ తొలగించిందని, ఈ సంఖ్య 40 నుంచి 50 వేల వరకు ఉండవచ్చని కామెంట్లు చేశారు. అయితే, సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారాన్ని టీసీఎస్ ప్రతినిధి తీవ్రంగా ఖండించారు. 80 వేల మందిని తొలగించారన్న వార్త పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. కాగా, ఇదే ఏడాది ఆగస్టులో 12,000 మంది ఉద్యోగులను తొలగించాల్సి వచ్చినట్లు కంపెనీ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. గత రెండేళ్లుగా జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగంగా అభివృద్ధి చెందడమే ఐటీ రంగంలో తొలగింపులకు ప్రధాన కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. కోడింగ్ వంటి అనేక పనులను ఏఐ సులభంగా చేస్తుండటంతో కంపెనీలు తమ ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకుంటున్నాయి. ముఖ్యంగా మధ్యస్థాయి సీనియర్ ఉద్యోగులపై ఈ ప్రభావం ఎక్కువగా పడుతోంది. ఇదే తరహాలో, మరో ఐటీ దిగ్గజం యాక్సెంచర్ కూడా గత మూడు నెలల్లో సుమారు 11,000 మంది ఉద్యోగులను తొలగించినట్లు సమాచారం. ఏఐ రాకతో ఉద్యోగాలు పోతాయని భయపడకుండా, దానిని ఒక సాధనంగా వాడుకుని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని టెక్ నిపుణులు సూచిస్తున్నారు.

"భారతదేశంలో అద్భుతమైన సాంకేతిక ప్రతిభ ఉంది. ఏఐ నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా వారు కంపెనీలకు మరింత విలువైన ఆస్తిగా మారవచ్చని గూగుల్ ఏఐ చీఫ్ డాక్టర్ జెఫ్ డీన్ గతంలో బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో అన్నారు. ఏఐ టెక్నాలజీని అందిపుచ్చుకున్న వారికే భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు ఉంటాయని పర్పెక్సిటీ ఏఐ సహ వ్యవస్థాపకుడు అరవింద్ శ్రీనివాస్ కూడా అభిప్రాయపడ్డారు.

# అక్టోబరులో బ్యాంకు సెలవులు ఇవే..




**ముంబయి, అక్టోబరు 1:** గాంధీ జయంతి, దుర్గా పూజ, నవరాత్రి, దసరా వంటి ప్రధాన పండుగల కారణంగా అక్టోబర్ నెలలో బ్యాంకులు పలు చోట్ల, ఆయా సెలవు దినాల్లో పనిచేయవు. ఆయా రోజుల్లో జాతీయ, ప్రాంతీయ పండుగలు, ప్రత్యేక దినాలు, వారాంతపు సెలవుల కారణంగా బ్యాంకింగ్ సేవలు ప్రభావితమవుతాయి. అక్టోబర్‌లో దేశ వ్యాప్తంగా బ్యాంకు హాలిడేలు ఇలా ఉన్నాయి. రోజువారీ వివరాలు ఇలా ఉన్నాయి అక్టోబర్ 1 బుధవారం నవరాత్రి ముగింపు / మహా నవమి / దసరా / ఆయుధ పూజ / విజయదశమి / దుర్గా పూజ కారణంగా అగర్తలా, బెంగళూరు, భువనేశ్వర్, చెన్నై, గాంగ్‌టాక్, గువహాటి, ఇటానగర్, కాన్పూర్, కోచి, కోహిమా, కోల్‌కతా, లక్నో, పట్నా, రాంచీ, షిల్లాంగ్, తిరువనంతపురం ప్రాంతాల్లో బ్యాంకులు పనిచేయవు. అక్టోబర్ 2 గురువారం మహాత్మా గాంధీ జయంతి / దసరా / విజయ దశమి / దుర్గా పూజ / శ్రీ శ్రీ శంకరదేవ జన్మోత్సవం దేశవ్యాప్తం ప్యాన్‌ఇండియా సెలవు. అక్టోబర్ 3 శుక్రవారం దుర్గా పూజ గాంగ్‌టాక్ ప్రాంతాల్లో బ్యాంకులు పనిచేయవు.

అక్టోబర్ 4 శనివారం దుర్గా పూజ గాంగ్‌టాక్ ప్రాంతాల్లో బ్యాంకులు పనిచేయవు. అక్టోబర్ 5 ఆదివారం వీక్లీ ఆఫ్ సండే దేశవ్యాప్తం ప్యాన్ ఇండియా సెలవు. ఈ హాలిడేలు ఆర్‌బీఐ ద్వారా నిర్ణయించబడిన జాతీయ, ప్రాంతీయ పండుగల ఆధారంగా ఉన్నాయి. అలాగే, రెండవ, నాల్గవ శనివారాలు, అన్ని ఆదివారాలు బ్యాంకులకు సెలవు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సహా ప్రధాన బ్యాంకులు ఈ రోజుల్లో పూర్తిగా మూసివేస్తారు.

# దళితులపై దాడులు ఎపిలోనే ఎక్కువ

## దేశవ్యాప్తంగా 14 శాతం పెరిగిన వరకట్న కేసులు

### ఎన్‌సిఆర్‌బి-2023 వార్షిక నివేదికలో వెల్లడి

**విజయవాడ,అక్టోబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** దళితులపై జరిగిన నేరాలు,ఆకృత్యాల్లో ఆంధ్రప్రదేశ్‌ను దక్షిణ భారతదేశంలో ముందంజన నిలిచిందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) తాజాగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఎన్‌సీఆర్‌బీ-2023 వార్షిక నివేదికలో ఈ విషయాన్ని వివరించింది. 2023లో కర్ణాటకలో (1923),తెలంగాణ (1709), తమిళ నాడు(1921),కేరళ (1,128) నేరాలు జరగ్గా ఆ రాష్ట్రాల్ని మించి ఏపీలో (2,027) దళితులపై దారుణ ఘటనలు చోటుచేసుకున్నాయి. వారానికి సగటున ముగ్గురు దళిత మహిళలు అత్యాచారానికి గురయ్యారు. ప్రతి నెలా ముగ్గురు దళితులు హత్యకు గురికాగా,నలుగురు హత్యాయత్నం బారిన పడ్డారు. వారానికి 11 మంది దాడులకు భాధితులయ్యారు. దళితులపై సగటున రోజుకు 5-6 అకృత్యాలు జరిగాయి. మనకంటే పెద్ద రాష్ట్రాలైన కర్ణాటక,తమిళనాడుతో పోలిస్తే ఏపీలోనే దళితులపై ఎక్కువ అఘాయిత్యాలు చోటుచేసుకున్నాఏయి. జాతీయ నేర గణాంక సంస్త (ఎన్‌సీఆర్‌బీ) 2023కు సంబంధించిన వార్షిక నేర నివేదికను మంగళవారం విడుదల చేసింది. ఆ వివరాలను విశ్లేషిస్తే వైకాపా హయాంలో రాష్ట్రం లోని దళితుల భద్రత ఎంత ప్రశ్నార్థకంగా మారింతో స్పష్టమవుతోంది. దళితులపై నేరాల్లో ఏపీ దేశంలో ఏడో స్థానంలో ఉంది. 2023లో దేశవ్యాప్తంగా దళితులపై 57,789 నేరాలు జరగ్గా...వాటిల్లో 2027 (3.50 శాతం)ఏపీ లోనే జరిగాయి.అంతకుముందు సంవత్సరాల కంటే.. 2023లో దేశవ్యాప్తంగా వరకట్న కేసులు 14 శాతం పెరిగాయని. 2023లో దేశవ్యాప్తంగా 15 వేల వరకట్న కేసులు నమోదయ్యాయి. వరకట్న వేధింపులకు 6,100 మంది మహిళలు బలయ్యారు అని ఎన్‌సిఆర్‌బి నివేదిక తెలిపింది. 2023లో వరకట్న నిషేధ చట్టం కింద 15,489 కేసులు నమోదయ్యాయని ఎన్‌సిఆర్‌బి క్రైమ్ ఇన్ ఇండియా 2023 నివేదిక పేర్కొంది. 2022లో 13,479, 2021లో 13,568 ఈ చట్టం కింద కేసులు నమోదయ్యాయి.

2021 - 2022 కంటే 2023లో 14 శాతం వరకట్న కేసులు పెరిగాయని ఎన్‌సిఆర్‌బి నివేదిక స్పష్టం చేసింది.

రాష్ట్రాల వారీగా చూస్తే.. వరకట్నపు కేసుల్లో ఉత్తరప్రదేశ్‌నే టాప్ ప్లేస్‌లో ఉంది. ఆ రాష్ట్రంలో వరకట్న నిషేధ చట్టం కింద 7,151 కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత బీహార్ 3,665, కర్ణాటక 2,322ల కేసులతో వరుస స్థానాల్లో నిలిచాయి. పశ్చిమ బెంగాల్, గోవా, అరుణాచల్‌ప్రదేశ్, లడక్, సిక్కిం సహా 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో వరకట్న కేసులు నమోదవ్వకపోవడం గమనార్హం.

వరకట్న వేధింపుల వల్ల 2023లో మొత్తం 6,156 మంది మహిళలు మృతి చెందారు. ఈ మరణాల్లో కూడా ఉత్తరప్రదేశ్‌నే మొదటిస్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో వరకట్న మరణాలు 2,122 నమోదయ్యాయి.

బీహార్ 1,143. 2023లో దేశవ్యాప్తంగా 833 హత్య కేసుల్లో వరకట్నమే ప్రధానకారణంగా నమోదైనట్లు ఎన్‌సిఆర్‌బి నివేదిక తెలిపింది. ఇక వరకట్న నిషేధ చట్టం కింద 2023లో 83,327 కేసులు కోర్టు ముందు విచారణకు వచ్చాయి. వీటిల్లో 69,434 కేసులు అంతకుముందు సంవత్సరాల కంటే.. వేగవం తంగా కోర్టు విచారణకు వచ్చాయి. ఈ చట్టం కింద 2023లో 27,154 మందిని పోలీసులు అరెస్టు చేశారు.వీరిలో 22,316 మంది పురుషులు, 4,838 మహిళలు ఉన్నారని ఎన్‌సిఆర్‌బి నివేదిక వెల్లడించింది.

# మార్కెట్లకు ఆర్బీఐ బూస్ట్

## లాభాల్లో ముగిసిన సెన్సెక్స్,నిఫ్టీ



**ముంబయి, అక్టోబరు 1:** ఆర్బీఐ తన మానిటరీ పాలసీ సమీక్షలో రెపోరేట్లను యధాతథంగా ఉంచుతున్నట్లు నిర్ణయించడంతో సెన్సెక్స్,నిఫ్టీలు లాభాల్లో ముగిసాయి. రెపోరేట్లను 5.5శాతం వద్ద యదాతథంగానే కొనసాగిస్తామని ప్రకటించింది. నిఫ్టీ 24,800 స్థాయికి ఎగువన ముగిసింది. మీడియా, ప్రైవేటు బ్యాంకులు, ఫార్మా షేర్లు,బ్యాంకులస్టాక్స్ లాభాల్లో ముగిసాయి. ఎస్ అండ్‌పి బిఎస్‌ఇ సెన్సెక్స్ 715.69 పాయింట్లు పెరిగి 80,983.31 వద్ద స్థిరపడితే నిఫ్టీ 50 సూచీ 225.20 పాయింట్లు లాభపడి 24,836.30 పాయింట్లవద్ద స్థిరప డింది. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.91శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.16శాతం పెరిగాయి. మార్కెట్‌పరంగా సెన్సెక్స్‌లో 2804 షేర్లు పెరిగాయి. 1346 కంపెనీలషేర్లు క్షీణించగా 141 కంపెనీలషేర్లు స్థిరంగా కొనసాగాయి. దసరా, మహాత్మాగాంధీ జయంతి కావడంతో స్టాక్ మార్కెట్లు గురువారం మూతపడనున్నాయి. అలాగే బ్యాంకులకు ఇచ్చే స్వల్పకాలిక వడ్డీరేటునుకూడా 5.75శాతం వద్దనే ఉంచింది. నిఫ్టీలోమీడియా సూచీ 3.58శాతం పెరిగింది. సన్ నెట్‌వర్క్ 9.99శాతం, నజారా టెక్నాలజీస్ 9.49శాతం, పివిఆర్‌ఐనాక్స్ 2.05శాతం, జీ ఎంటర్‌టైన్‌మెంట్ 1.54శాతం, నెట్‌వర్క్ 18 మీడియా ఇన్వెస్ట్‌మెంట్స్ 0.84 శాతం సరిగమ ఇండియా 0.77శాతం, హాత్‌వే కేబుల్ అండ్ డేటాకామ్ 0.71శాతం, డిబికార్ప్ 0.09శాతం చొప్పున పెరిగాయి. ఇక టిప్స్ మ్యూజిక్ మాత్రం 1.61శాతం ప్రైమ్‌ఫోకస్ 0.68శాతంచొప్పున దిగువన ముగిసాయి. ఆటోమొబైల్ విక్రయాలు ఊపందుకోవడంతో కంపెనీలషేర్లుకూడా పెరిగాయి.ఎస్కార్ట్స్ 5.64 శాతం, విఎస్టీ టిల్లర్స్ ట్రాక్టర్స్ 3.82శాతం, అతుల్ ఆటో 4.05 శాతం, మహీంద్ర అండ్ మహీంద్ర 1.21శాతం, హుండై మోటార్ ఇండియా 1.63శాతం, ఎస్‌ఎంఎల్ ఇసుజు 0.75 శాతం, స్టీల్‌స్ట్రిప్స్ వీల్స్ 3.33శాతం, బజాజ్ ఆటో 0.61శాతం పెరిగాయి.హైటెక్ పైప్స్ 3.83శాతంపెరిగితే ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ 2.86శాతం పెరిగింది. రైల్‌టెల్ కార్పొరేషన్ కూడా 3.69 శాతం, ఎస్జీ ఫిన్‌షెర్వ్ 1.97శాతం, క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్స్ 2.08శాతం చొప్పున ముందుకు కదిలాయి. యూరోపియన్ షేర్లు మిశ్రమంగా ముగిసాయి. అమెరికా షట్‌డౌన్‌తో మార్కెట్లుక్షీణించాయి. ఆసియా మార్కెట్లు కూడా మిశ్రమంగానే ముగిసాయి. మెయిన్ ల్యాండ్ చైనా, హాంకాంగ్‌లలో శెలవు కారణంగా మూతపడ్డాయి. జపాన్‌లో సెంట్రల్ బ్యాంకు మూడోత్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది.

# కరవు ప్రాంతాలకు గోదావరి జలాలు

## రూ. 58 వేల కోట్లతో పోలవరం-సోమశిల అనుసంధానం

### మూసీ-మున్నేరు నదుల మధ్య ఆయకట్టుకూ నీరందే అవకాశం

**విజయవాడ,అక్టోబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం - సోమశిల అనుసంధానం చేసే ప్రతిపాదనను లోతుగా అధ్యయనం ఎపి ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది.ఈ ప్రాజెక్టు కోసం దాదాపు 58 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. దీని ద్వారా మూసీ, మున్నేరు నదుల మధ్య ఆయకట్టుకూ నీళ్లు అందే అవకాశం ఉంటుందని ఎపి జలవనరుల మంత్రిత్వశాఖ అంచనా వేస్తోంది. సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఉన్నతాధికారులు,సాగునీటి ప్రాజెక్టు నిపుణులతో మంతనాలు చర్చలు జరుపుతున్నారు. గోదావరి వరద జలాలను కరవు ప్రాంతాలకు, రాయలసీమకు మళ్లించే క్రమంలో అనేక ప్రత్యామ్నాయా లపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పోలవరం బనకచర్ల అనుసంధానంపై అనేక సమావేశాలు, చర్చోప చర్చలు జరిపిన అనంతరం జలవనరులశాఖ తాజాగా ఈ ప్రతిపాదనకు కొత్త రూపు తీసుకువచ్చింది. అంచనా వ్యయం తగ్గించి, టన్నెళ్లు మినహాయించి నల్లమల సాగర్ జలాశయం ఆయకట్టు స్థిరీకరణకు నీళ్లు ఇవ్వడంతోపాటు సోమశిల జలాశయానికి ఈ నీళ్లు చేర్చేలా కొత్త ప్రతిపాదన రూపొందించింది. మూడు సెగ్మెంట్లలో ఈ పనులు చేపట్టేందుకు దాదాపు 58 వేలకోట్ల అంచనా వ్యయంగా లెక్కిస్తున్నారు. ఇందులో +15.50 మీటర్ల నుంచి +250 మీటర్ల వరకూ నీటిని ఎత్తిపోస్తే సరిపోతుంది. అంచనా వ్యయమూ తగ్గుతుంది. ఈప్రతిపాదన వల్ల 7లక్షలఎకరాల కొత్త ఆయకట్టు, 6 లక్షల ఎకరాల స్థిరీకరణ సాధ్యమవుతుంది. రాయలసీమతో పాటు, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని కరవు ప్రాంతాల్లో ఆయకట్టుకూ నీళ్లు అందించే ఆస్కారం ఉంది. ప్రస్తుతం కొత్త ప్రతిపాదనపై కసరత్తు సాగుతోంది. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపుల తర్వాత గోదావరి వరద జలాల మళ్లింపు పథకం తుది రూపు దిద్దుకోనుంది. సెగ్మెంట్ 1లో పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీకి నీళ్లు మళ్లించనున్నారు. జులై 1 నుంచి అక్టోబరు 15 లోపు రోజుకు 2 టిఎంసిల చొప్పున నీటిని మళ్లించే అవకాశం ఉంటుంది. 83 రోజులు సముద్రంలో లక్ష క్యూసెక్కులపైన నీళ్లు కలిసిపోతున్నాయి. రోజుకు 2 టిఎంసిలు చొప్పున 100 రోజులపాటు మళ్లించేందుకు సమస్య ఉండదు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులతో పాటు,కొత్తగా ప్రతిపాదిస్తున్న ప్రాజెక్టుల అవసరాలు తీరిన తర్వాతే ఈ వరద జలాలు మళ్లిస్తారు. దీని కోసం ప్రత్యేకంగా పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజి వరకు వరద కాలువను నిర్మిస్తారు. తాడిపూడి కాలువను దీనికి ఉపయోగించుకుంటారు. సెగ్మెంట్ 1కు దాదాపు 13 వేల కోట్లు ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా వేస్తున్నారు. సెగ్మెంట్ 2 లో ప్రకాశం బ్యారేజీ నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు నీటిని మళ్లిస్తారు.




## గ్రాండ్ చెస్ టూర్‌లో.. ప్రజ్ఞానంద ఓటమి

**న్యూఢిల్లీ:** గ్రాండ్ చెస్ టూర్-2025 సెమీస్‌లో భారత్ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద రమేష్‌బాబు ఓడిపోయాడు. తదుపరి మూడో స్థానం కోసం పోటీపడనున్నాడు. గ్రాండ్ చెస్ టూర్ ఫైనల్స్‌కు అర్హత సాధించిన ఏకైక భారతీయుడు ప్రజ్ఞానంద బుధవారం జరిగిన సెమీఫైనల్ టైబ్రేక్‌లో మాక్సిమ్ వాచియర్‌లాగ్రేవ్ చేతిలో పరాజయం చెందాడు. రెండు క్లాసికల్ గేమ్‌లు డ్రాగా ముగియడంతో, ప్రజ్ఞానంద, వాచియర్‌లాగ్రేవ్, రాపిడ్, బ్లిట్జ్ టైబ్రేక్‌లలో తలపడ్డారు. 20 ఏళ్ల ప్రజ్ఞానంద రాపిడ్ టైమ్ కంట్రోల్‌లో వెనుకబడి, మరింత అనుభవజ్ఞుడైన ప్రత్యర్థి చేతిలో 2-6 తేడాతో ఓడిపోయాడు. బ్లిట్జ్ గేమ్‌లలో ప్రజ్ఞానంద తిరిగి పోరాడటానికి ప్రయత్నించినా వాచియర్‌లాగ్రేవ్‌ను అధిగమించలేకపోయాడు. తరువాతి హోల్డ్ 3-3తో డ్రాగా ముగిసింది. చివరికి మ్యాచ్ స్కోరు 15-11తో వాచియర్‌లాగ్రేవ్‌కు అనుకూలంగా ఉంది. ఇక మూడవ స్థానం కోసం జరిగే మ్యాచ్‌లో ప్రజ్ఞానంద గ్రాండ్ మాస్టర్ లెవాన్ అరోనియన్‌తో తలపడనున్నాడు. ఉత్కంఠభరితమైన టైబ్రేక్ పోరు తర్వాత మరో సెమీఫైనల్లో అరోనియన్ 12-14 తేడాతో ఓడిపోయాడు.




## వరల్డ్ కప్ ఎయిర్ రైఫిల్‌లో.. భారత్‌కు స్వర్ణం, రజతం, కాంస్యం

**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ 2025లో భారత్ ఆధిపత్యం కొనసాగుతోంది, ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్‌లో భారత్ ఖాతాలో స్వర్ణంతో సహా మూడు పతకాలు జమయ్యాయి. దీంతో ఇప్పుడు 23 పతకాలతో (7 స్వర్ణాలు, 9 రజతాలు మరియు 7 కాంస్యాలు) అగ్రస్థానంలో ఉంది. డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన ప్రపంచ కప్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్‌లో భారత్ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్‌లో స్వర్ణం, రజతం మరియు పురుషుల ట్రాప్‌లో కాంస్యం సాధించింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లో ఉత్కంఠభరితంగా జరిగిన అఖిల భారత పోటీలో, ఇషా అనిల్ తక్సాలే మరియు హిమాన్షు అసాధారణ పునరాగమనం చేసి, స్వదేశీయులైన శాంభవి ఎస్. క్షీర్‌సాగర్ మరియు నరెయిన్ ప్రణవ్‌లను 17-15తో ఓడించి స్వర్ణం గెలుచుకున్నారు. 15-9తో వెనుకబడిన ఈ జంట, వరుసగా నాలుగు సిరీస్‌లను గెలుచుకోవడం ద్వారా పుంజుకుంది, బహుళ పరిపూర్ణ 10.9 షాట్‌లతో అద్భుతమైన ఖచ్చితత్వాన్ని ప్రదర్శించింది. వ్యక్తిగత తటస్థ అథ్లెట్లు వర్వారా కర్దకోవా మరియు కమిల్ నురియాఖ్మెటోవ్‌లకు కాంస్యం లభించింది, వారు మరియా క్రుగ్లోవా, టిమోఫీ అలీనికోవ్‌లను 17-9తో ఓడించారు. ఇక ట్రాప్ ఈవెంట్లలో, పురుషుల జూనియర్ ఫైనల్లో వినయ్ ప్రతాప్ సింగ్ చంద్రవత్ 34 హిట్స్‌తో కాంస్యం సాధించింది.

# రాయల్ ఛాలెంజర్స్ ఫర్ సేల్

## ఫ్రాంచైజీ అమ్మకానికి డిసైడ్.. ఐపిఎల్ సాధించినా కష్టాల్లో యాజమాన్యం



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టుకు 2025 సంవత్సరం ఆనందాన్ని నింపినప్పటికీ, అదే స్థాయిలో విషాదాన్ని కలిగించింది. ఈ సంవత్సరం ఐపీఎల్‌లో ఆర్సీబీ జట్టు అదరగొట్టింది. ఐపీఎల్ ప్రారంభ సీజన్ నుంచి ఆర్సీబీ ట్రోఫీని గెలవలేదు. ఆ జట్టు తొలిసారి ఈ ఏడాది ఐపీఎల్ 2025 ట్రోఫీని కైవసం చేసుకుంది. అదే సమయంలో ఆ జట్టు ఓ అత్యంత విషాద ఘటనను ఎదుర్కొంది. ఆర్సీబీ జట్టు ఐపీఎల్ విజేతగా నిలిచిన తరువాత బెంగళూరులో నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాట చోటు చేసుకొని 11 మంది మరణించారు. అనేక మంది గాయపడ్డారు. ఈ ఘటన తరువాత ఆ జట్టు యాజమాన్యం అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఆర్సీబీ ఫ్రాంచైజీని విక్రయించేందుకు యాజమాన్యం సిద్ధమైందని తెలుస్తోంది. ఆర్సీబీ యాజమాన్యం తమ బ్యాలెన్స్ షీట్ నుంచి ఫ్రాంచైజీని తొలగించడంపై తుది నిర్ణయం తీసుకుందని మాజీ ఐపీఎల్ ఛైర్మన్ లలిత్ మోదీ సోషల్ మీడియా వేదికగా సంచలన పోస్టు చేశారు. దీనికి సంబంధించి డాక్యుమెంట్స్ పూర్తయ్యాయని, కొనేవారు ఉంటే కచ్చితంగా ఆ ఫ్రాంచైజీ ఓనర్లు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన పోస్టు పెట్టారు. లలిత్ మోదీ పేర్కొన్న వివరాల ప్రకారం ఆర్సీబీ ఫ్రాంచైజీ అమ్మకం గురించి గతంలో అనేకసార్లు పుకార్లు వచ్చాయి. వాటిని యాజమాన్యం ఖండించింది.






## చరిత్ర సృష్టించిన నేపాల్

### వెస్టిండీస్‌పై సిరీస్ విజయం

**న్యూఢిల్లీ:** పసికూన నేపాల్ జట్టు చరిత్ర సృష్టించింది. రెండు సార్లు టీ20 ఛాంపియన్లు అయిన వెస్టిండీస్ పై తొలిసారి సిరీస్ విజయాన్ని నమోదు చేసింది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే కైవసం చేసుకుంది. ఐసీసీ టెస్టు ఆడుతున్న దేశాలపై ఓ ద్వైపాక్షిక సిరీస్‌ను గెలుచుకోవడం నేపాల్‌కు ఇదే తొలిసారి కావడం గమనార్హం. షార్జా వేదికగా జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో నేపాల్ తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు సాధించింది. నేపాల్ బ్యాటర్లలో ఆసిఫ్ షేక్ (68; 47 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లు), సందీప్ జోరా (63; 39 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపు హాఫ్ సెంచరీలు సాధించారు. విండీస్ బౌలర్లలో అకేల్ హోసేన్, కైల్ మేయర్స్ లు చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 174 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 17.1 ఓవర్లలో 83 పరుగులకే ఆలౌటైంది. దీంతో విండీస్ 90 పరుగుల తేడాతో నేపాల్ విజయాన్ని అందుకుంది. విండీస్ బ్యాటర్లలో జేసన్ హోల్డర్ (17), అమీర్ జాంగో (16), అకీమ్ అగస్టే (17)లు రెండు అంకెల స్కోరు సాధించారు. మిగిలిన వారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యారు.

## ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో రోహిత్‌కు రజతం, శ్రీహరికి ఐదవ కాంస్యం





**న్యూఢిల్లీ:** 2025 ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో రోహిత్ బెనెడిక్టన్ రజతం గెలుచుకోగా, కాంస్యంతో శ్రీహరి నటరాజ్ ఐదవ పతకాన్ని సాధించాడు. వీర్ సావర్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న 2025 ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్‌ల మూడవ రోజు బుధవారం శ్రీహరి నటరాజ్ మరోసారి భారతదేశం తరపున పతకంతో నిలిచాడు. పురుషుల 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో కాంస్యం సాధించి, తన పతకాల సంఖ్యను ఐదుకు పెంచుకున్నాడు. అలాగే పురుషుల 50 మీటర్ల బటర్‌ఫ్లైలో రోహిత్ బెనెడిక్టన్ 23.89 సెకన్లలో ఉత్తమ భారతీయ సమయంతో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఐదవ లేన్‌లో డ్రా అయిన శ్రీహరి తన రేసును తెలివిగా ముందుకు తీసుకెళ్లాడు. చైనాకు చెందిన హావోయు వాంగ్ (49.19) మరియు ఖతార్‌కు చెందిన అలీ టామర్ హసన్ (49.46) ముందు ఉండగా, అతను 50 మీటర్ల మార్కు వద్ద మూడవ స్థానంలో నిలిచాడు. ఆకాష్ మణి (50.45) నాల్గవ స్థానంలో నిలిచాడు. చివరి 50 మీటర్ల స్ప్రింట్‌లో, శ్రీహరి తన లయను కొనసాగిస్తూ, చేజింగ్ ప్యాక్‌ను నిలబెట్టుకుని 49.96 సెకన్లలో కాంస్యం సాధించాడు.

# 'మటన్ సూప్' టీజర్ లాంచ్

**క్రేజీ టైటిల్,** డిఫరెంట్ స్టోరీతో రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు బ్యానర్లపై రమణ్, వర్షా విశ్వనాథ్ హీరో హీరోయిన్లుగా రామచంద్ర వట్టికూటి తెరకెక్కించిన చిత్రం 'మటన్ సూప్'. "విట్‌నెస్ ది రియల్ క్రైమ్' ట్యాగ్ లైన్. మల్లిఖార్జున ఎలికా (గోపాల్), రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి నిర్మాతలుగా రానున్న ఈ నూతన చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్, మోషన్ పోస్టర్, పాటలు ఇప్పటికే సోషల్ మీడియాలో అందరినీ ఆకట్టుకున్నాయి. దసరా సందర్భంగా 'మటన్ సూప్' టీజర్‌ను సెన్సేషనల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. ఈ టీజర్‌ను లాంఛ్ చేసిన అనంతరం అనిల్ రావిపూడి మాట్లాడుతూ..'మటన్ సూప్' టైటిల్ చాలా బాగుంది. టీజర్ బాగుంది. టీం కూడా చాలా కొత్తగా ఉంది. దర్శకుడు రామచంద్రకు, హీరో రమణ్‌కు, సినిమా టీంకు ఆల్ ది బెస్ట్. అక్టోబర్ 10న చిత్రం రాబోతోంది. అందరూ చూసి పెద్ద సక్సెస్ చేయాలి' అని అన్నారు.

నిర్మాత మల్లిఖార్జున ఎలికా (గోపాల్) మాట్లాడుతూ.. 'గ్రేట్ డైరెక్టర్ అనిల్ రావిపూడి గారు మా టీజర్‌ను లాంఛ్ చేయడం ఆనందంగా ఉంది. మంచి స్క్రీన్ ప్లేతో మా చిత్రం రాబోతోంది. అందరూ వీక్షి ంచి సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను' అని అన్నారు. దర్శకుడు రామచంద్ర వట్టికూటి మాట్లాడుతూ.. ' సెన్సేషనల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి గారు మా టీజర్‌ను లాంఛ్ చేయడం మా అదృష్టం. మా నిర్మాతలు నాకు ఎంతో అండగా నిలిచారు. రమణ్ గారు ఎంతో గొప్పగా నటించారు. మా అందరినీ ముందుండి నడిపిస్తున్న పర్వతనేని రాంబాబు గారికి థాంక్స్. గొప్పగా నటించిన గోవింద్, జెమినీ సురేష్ గార్లకు థాంక్స్. నాకు అండగా నిలిచిన సునీత అక్కకి థాంక్స్. మా సినిమాకు అందరూ చూసి సపోర్ట్ చేయాలని, పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. నిర్మాతలు రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి మాట్లాడుతూ..'మా మటన్ సూప్ టీజర్‌ను విడుదల చేసిన అనీల్ రావిపూడి గారికి థాంక్స్. ట్రెండ్‌కు తగ్గ కథ. అన్నీ వర్గాల ప్రేక్షకులను మెప్పించే సినిమా అవుతుంది. దర్శకుడు రామచంద్ర సినిమాను చక్కగా తెరకెక్కించారు. హీరో రమణ్, వర్షా విశ్వనాథ్, జెమినీ సురేష్ సహా అందరి పెర్ఫామెన్స్ మెప్పిస్తుంది. సినిమాను అక్టోబర్ 10న రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నాం' అన్నారు.

హీరో రమణ్ మాట్లాడుతూ.. 'మటన్ సూప్' టీజర్‌ను లాంచ్ చేసిన గ్రేట్ డైరెక్టర్ అనిల్ రావిపూడి గారికి థాంక్స్. మా దర్శక, నిర్మాతలు ఎంతో కష్టపడి ఈ మూవీని రూపొందించారు. టీజర్ చాలా బాగుందని అందరూ మెచ్చుకుంటున్నారు. అక్టోబర్ 10న రాబోతోన్న మా మూవీని అందరూ చూసి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.



## 'మన శంకరవరప్రసాద్ గారు' నుంచి నయనతార ఫస్ట్ లుక్ రిలీజ్



**మెగాస్టార్ చిరంజీవి,** హిట్ మెషిన్ అనిల్ రావిపూడి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకరవరప్రసాద్ గారు'లో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. శశిరేఖగా ది మాగ్నిఫిసెంట్ నయనతారను పరిచయం చేస్తూ, మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పసుపు రంగు చీరలో మెరిసిపోతూ కనిపించిన ఆమె లుక్ అదిరిపోయింది. ముత్యాల హారం, సంప్రదాయ గాజులతో, చేతిలో నలుపు రంగు హ్యాండిల్‌తో ఉన్న గొడుగును పట్టుకొని, ఫెస్టివల్ వైబ్ కనిపించిన ఈ లుక్ శశిరేఖ పాత్రకు గొప్ప సొగసుని తీసుకొచ్చింది. నయనతార పాత్ర కథలో చాలా కీలకంగా ఉండబోతోంది. ఆసక్తికరమైన విషయం ఏంటంటే, సాధారణంగా సినిమా ప్రమోషన్లకు దూరంగా ఉండే నయన్, ఈ చిత్ర ప్రచార కార్యక్రమాల్లో మొదటి నుంచే చురుకుగా పాల్గొంటున్నారు. విజయదశమి శుభ సందర్భంగా ఒక ప్రత్యేక సర్‌ప్రైజ్‌ను అనౌన్స్ చేస్తున్నట్లు మేకర్స్ తెలియజేశారు. ఇంతకుముందు చిరంజీవి ఫస్ట్ లుక్‌ను విడుదల చేస్తూ, ఆయనను స్టైలిష్ అవాతర్‌లో చూపించడం అందరినీ ఆకట్టుకుంది. టాప్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా సమీర్ రెడ్డి, ఎడిటర్‌గా తమ్మిరాజు, ఆర్ట్ డైరెక్టర్‌గా ఏఎస్ ప్రకాష్ పనిచేస్తున్నారు. ఎస్. కృష్ణ, జి. ఆది నారాయణ సహా రచయితలు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేస్తున్నారు. 'మన శంకరవరప్రసాద్ గారు' 2026 సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.




## 'బా బా బ్లాక్ షీప్' మోషన్ పోస్టర్ విడుదల

**గన్స్, గోల్డ్** చుట్టూ జరిగే వేట.. ముగ్గురి తెలివి తేటలు.. ఒక రోజులో జరిగే ఘటనలు.. ఓ ఆరుగురి ప్రయాణంతో న్యూ ఏజ్ క్రైమ్ కామెడీగా 'బాబా బ్లాక్ షీప్' అనే చిత్రం రాబోతోంది. దోణెపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోణెపూడి నిర్మి స్తున్న ఈ మూవీకి గుణి మంచికంటి దర్శకత్వం వహిస్తున్నారు. టిను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ లగుసాని, విష్ణు, కార్తికేయ, విస్మయశ్రీ, మాళవి తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. దసరా సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన కథ, కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ మేకర్స్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ చేతుల మీదుగా 'బా బా బ్లాక్ షీప్' మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేయించారు. ఈమోషన్ పోస్టర్‌నుచూస్తుంటే.. గన్స్, గోల్డ్ చుట్టూ జరిగే ఓ న్యూఏజ్ క్రైమ్ కామెడీఅని అర్థంఅవుతోంది. ఓ ముగ్గురు చుట్టూ తిరిగే కథ అంతా కూడా ఒకే రోజులో జరుగుతుందని తెలుస్తోంది. ఈ ప్రయాణంలో వారికి ఎదురైన పరిస్థితులు, ఆ పరిస్థితుల్లోంచి పుట్టే కామెడీ, ఈ జర్నీలో జరిగే క్రైమ్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌కి కొత్త అనుభూతిని ఇచ్చేలా కనిపిస్తోంది.

# 'మాస్ జాతర' అక్టోబర్ 31న విడుదల




**మాస్ మహారాజా** రవితేజ అభిమానులతో పాటు, తెలుగు సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మాస్ జతర' చిత్రం అక్టోబర్ 31న విడుదల కానుంది. ఈ మేరకు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. వింటేజ్ వైబ్స్, పక్కా కమర్షి యల్ అంశాలతో ఈ చిత్రం థియేటర్లలో అసలుసిసలైన మాస్ పండుగను తీసుకురాబోతుంది. ఇప్పటివరకు ఈ సినిమా నుండి విడుదలైన ప్రతి కంటెంట్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకొని, వినోదాల విందుకి హామీ ఇచ్చింది. కొత్త విడుదల తేదీ ప్రకటన సందర్భంగా రవితేజ, హైపర్ ఆదిలపై చిత్రీకరించిన ఒక సరదా వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. ఆ వీడియోలో హైపర్ ఆది 2025 సంక్రాంతి, వేసవి సెలవులు, వినాయక చవితి అంటూ పలుసార్లు సినిమా వాయిదా పడటాన్ని సరదాగా ఎగతాళి చేయగా.. ఆలస్యానికి గల కారణాలపై రవితేజ అంతే చమత్కారంగా స్పందించారు. మాస్ మహారాజా రవితేజ అంటేనే సందడి. ఒకప్పటి మాస్ మహారాజాను గుర్తుచేస్తూ.. సినిమా యొక్క ఆహ్లాదకరమైన మరియు వినోదాత్మక శైలిని చూపిస్తూ ఈ వీడియో ఎంతో ఉత్సాహభరితంగా సాగింది. ఇప్పటికే విడుదలైన 'మాస్ జతర' టీజర్‌కి అన్ని వర్గాల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ముఖ్యంగా మాస్ రాజా అభిమానులను, మాస్ ప్రేక్షకులను కట్టిపడేసింది. అలాగే, రెండు పాటలు విడుదలై శ్రోతల నుంచి భారీ ప్రశంసలు అందుకున్నాయి. అందరూ కాలు కదిపేలా ఎంతో ఉత్సాహభరితంగా స్వరపరిచిన ఈ పాటలు సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారాయి. ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ, శ్రీలీల జోడి అంటే, ప్రేక్షకులలో ప్రత్యేకమైన అంచనాలు ఉంటాయి. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఈ జోడి మరోసారి బాక్సాఫీస్ వద్ద మెరుపులు మెరిపించడానికి సిద్ధమవుతోంది. సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే రెండు పాటలతో అందరినీ మెప్పించిన ఆయన, మరోసారి మాస్ ప్రేక్షకులను తనదైన స్వరాలతో అలరించబోతున్నారు. దర్శకుడు భాను భోగవరపు మాస్ ప్రేక్షకులతో పాటు కుటుంబ ప్రేక్షకులు కూడా మెచ్చే విధంగా వాణిజ్య అంశాలతో అసలైన పండుగ సినిమాలా 'మాస్ జాతర'ను మలుస్తున్నారు. ఉత్సాహభరితమైన అవతారంలో రవితేజను చూడటానికి అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తి చూపిస్తారు. అందుకు తగ్గట్టుగానే అందరూ మెచ్చేలా మాస్ రాజాను చూపిస్తున్నారు దర్శకుడు భాను భోగవరపు. ఛాయాగ్రాహకుడు విధు అయ్యన్న అద్భుతమైన కెమెరా పనితనం, ప్రతి ఫ్రేమ్‌ను గొప్పగా తీర్చిదిద్దే నవీన్ నూలి ఎడిటింగ్ ప్రతిభ తోడై.. అసలైన పండుగ చిత్రంగా 'మాస్ జతర' రూపుదిద్దుకుంటోంది. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ పతాకాలపై 'మాస్ జాతర' చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రముఖ నిర్మాతలు సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఎక్కడా రాజీ పడకుండా భారీస్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మాస్ మహారాజా అభిమానుల దాహాన్ని తీర్చడానికి, థియేటర్లలో వినోదాల విందుని అందించడానికి అక్టోబర్ 31న 'మాస్ జాతర' సినిమా భారీస్థాయిలో విడుదలవుతోంది.



## 'ఈటీవీ విన్ అండ్ 90స్ కిడ్స్ ఎంటర్‌టైన్‌మెంట్' తొలి ప్రాజెక్టు లాంచ్

**నైన్‌టీస్ కిడ్స్** ఎంటర్‌టైన్‌మెంట్, ఈటీవీ విన్‌తో కలిసి, హైదరాబాద్‌లో జరిగిన పూజా వేడుకతో తమ తొలి ప్రొడక్షన్ ని లాంచ్ చేసింది. ఈ కార్యక్రమంలో తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు హాజరై టీంకి శుభాకాంక్షలు తెలిపారు. నిర్మాత రవిశంకర్ (మైత్రి మూవీ మేకర్స్) కెమెరా స్విచ్ ఆన్ చేశారు, దర్శకుడు హరీష్ శంకర్ ఫస్ట్ క్లాప్ కొట్టారు, నిర్మాత శిరీష్ ముహుర్తపు సన్నివేశానికి దర్శకత్వం వహించారు. బన్నీ వాస్, వినోద్ గాలి దర్శకత్వంలో 90స్ కిడ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై శరత్ చంద్ర నాయుడు నిర్మించిన ఈ ప్రాజెక్ట్, బలమైన భావోద్వేగాలతో కూడిన బడ్డీ కామెడీ, ఫ్యామిలీ ఎంటర్టైనర్. ఇది అన్ని వయసుల ప్రేక్షకులను అలరించేలా వుంటుంది.

తారాగణం: విరాజ్ అశ్విన్, ప్రియ దర్శిని రామ్, బాబు మోహన్, యశశ్రీ రావు, పవన్ సిద్ధు, టేస్టీ తేజ, సూర్య గోపీనాథ్, శివన్నారాయణ.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Superior Printers (P) Ltd. and published at Plot No.4-40/1, Alugunuru, 'X' Roads, Karimnagar-505527. Ph:2223355,2277034, 35, FAX: 2277036; Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2001/07563.